


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 09 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 82 పేజీలు : 4 వెల : రూ


## బీజేపీ నేతలు నీతులు చెప్పడం విడ్డూరం: పేర్ని నాని



అమరావతి: ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ కార్యక్రమాలు ఏపీలో అమలవుతున్నాయని రాష్ట్ర సమాచారశాఖ మంత్రి పేర్ని నాని అన్నారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాకెట్ కంటే వేగంగా పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్రం పెంచుతోందన్నారు. బీజేపీ నేతలు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలపై జాలి, దయ లేకుండా ధరలు పెంచుతున్నారు. రూ.70 పెట్రోల్‌ను రూ.110కి తీసుకెళ్లారు. ఇప్పుడు 5 రూపాయలు తగ్గించి గొప్పలు చెబుతున్నారని మంత్రి మండిపడ్డారు.అక్టోబర్‌లో ధర ఎంత ఉంది? నవంబర్‌లో ఎంత ఉంది. కేంద్రం చేస్తున్న దోపిడీ ప్రజలకు తెలియదా? బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో ధర్నా చేయాలి. రూ.5 కాదు రూ.25 తగ్గించాలని మోదీని డిమాండ్ చేయాలి. సెస్ రూపంలో కేంద్రం 2.85 లక్షల కోట్లు వసూలు చేసింది. బీజేపీ నేతలు ధర్నా చేస్తే నేను కూడా ఢిల్లీ వస్తా. ఫలితాలతో కేంద్రం కళ్లు తెరిచింది. ప్రజలపై జాలితో 5 రూపాయలు తగ్గించారు. కేంద్రం వసూలు చేస్తున్న పన్నులు ఎలా ఖర్చు చేస్తున్నారు. ఏపీలో అమలవుతున్న కార్యక్రమాలు ఎక్కడైనా ఉన్నాయా. సంక్షేమ పథకాలపై ఏపీ చేస్తున్న వ్యయం మీకు కనిపించలేదా?.గ్యాస్ ధరఎంతఉండేది.? ఇప్పుడుఎంతచేశారు.?అంటూపేర్నినాని ప్రశ్నించారు.సీఎం జగన్ పాలనను ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదిస్తు న్నారు. వరుస ఎన్నికల్లో వస్తున్న ఫలితాలే ప్రజా దరణకు నిదర్శనం. ప్రభుత్వంపై బురదజల్లేందుకే టీడీపీ బీజేపీ,టీడీపీల తప్పుడు విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మంత్రి పేర్ని నాని అన్నారు.

## ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్‌లో చెలరేగిన హింసాత్మక ఘటనపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన స్టేటస్ రిపోర్ట్‌పై మరోసారి అసంతృప్తి వ్యక్తం చేసింది. సాక్షులను విచారించామని చెప్పడం తప్ప.. రిపోర్టులో ఏమీ లేదని పేర్కొన్నది. హింసాకాండకు సంబంధించి 13 అరెస్టు చేయగా.. ఆశిష్ మిశ్రా ఫోన్‌ను జప్తు చేయడంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నిందితుల ఫోన్ కాల్ వివరాలు ఇవ్వాలని, పోలీసులు సేకరించిన ఆధారాలు కోర్టుకు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది.ఇతర కేసుల సాక్ష్యాలను ఈ కేసును ఉపయోగించకూడదని స్పష్టం చేసింది. కేసు విచారణను సీబీఐకి బదిలీ చేసేందుకు నిరాకరించింది. అలాగే లఖింపూర్ కేసులో ల్యాబ్ నివేదిక సమర్పించకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనికి స్పందించిన ప్రభుత్వం నవంబర్ 15న రిపోర్ట్ వస్తుందని చెప్పగా.. కోర్టు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. అప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని ఆదేశించింది. హింసాత్మక ఘటన విచారణ తాము ఆశించిన మేరకు దర్యాప్తు జరుగడం పేర్కొంది. హైకోర్టు మాజీ న్యాయమూర్తుల పర్యవేక్షణలో మొత్తం కేసును విచారించాలని కోర్టు సూచించింది. పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తులు రంజిత్ సింగ్, రాకేశ్ కుమార్ జైన్‌లను నియమించింది.

## రాఫెల్ ముడుపులపై దర్యాప్తు చేయకూడదని సీబీఐ నిర్ణయం



న్యూఢిల్లీ: ఫ్రాన్స్ కంపెనీ దస్సాల్ట్ నుంచి భారత్ కొనుగోలు చేసిన అత్యాధునిక 36 రాఫెల్ యుద్ధ విమానాల డీల్ సందర్భంగా చేతులు మారిన ముడుపుల సంగతి సీబీఐకి గతంలోనే తెలిసినప్పటికీ దీనిపై దర్యాప్తు చేయకూడదని నిర్ణయించినట్లు ఓ నివేదిక బటయపడింది. ఫ్రాన్స్‌కు చెందిన మీడియాపార్ట్ పోర్టల్ ఈ మేరకు ఆరోపిస్తూ ఒక కథనాన్ని ప్రచురించింది.రూ.59,000 కోట్ల రాఫెల్ డీల్‌పై ఆన్‌లైన్ జర్నల్ మీడియాపార్ట్ దర్యాప్తు చేస్తున్నది. తప్పుడు ఇన్వాస్‌లను ఎనేబుల్ చేసేందుకు మధ్యవర్తి సుసేన్ గుప్తాకు దస్సాల్ట్ కంపెనీ రహస్య కమీషన్లు చెల్లించినట్లు ఆరోపించింది. ఈ లావాదేవీలకు సంబంధించిన ఆధార పత్రాలు ఉన్నప్పటికీ భారతీయ ఫెడరల్ పోలీసులు ఈ వ్యవహారంపై దర్యాప్తును ప్రారంభించలేదని ఆ పోర్టల్ పేర్కొంది.రాఫెల్ జెట్‌ల అమ్మకానికి దస్సాల్ట్ కంపెనీ మధ్యవర్తి సుసేన్ గుప్తాకు చెందిన మారిషస్ షెల్ కంపెనీకి 7.5 మిలియన్ యూరోలు (దాదాపు రూ.650 మిలియన్లు) కిక్‌బ్యాక్‌గా చెల్లించినట్లు 2018 అక్టోబర్ 11న సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఆధారాలు అందాయని మీడియాపార్ట్ తెలిపింది. అగస్టా వెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ ఛాపర్‌ల సరఫరాకు సంబంధించిన కుంభకోణంపై ఈ రెండు ఏజెన్సీలు దర్యాప్తు చేస్తున్న సందర్భంగా బయటపడిన రహస్య పత్రాల్లో రాఫెల్ డీల్ ముడుపులకు సంబంధించిన ఆధారాలు కూడా ఉన్నాయని ఆ నివేదికలో పేర్కొంది. ఆరోపించిన చెల్లింపుల్లో ఎక్కువ భాగం 2013కు ముందు జరిగినట్లు తెలిపింది.మారిషస్ నుంచి సీబీఐ, ఈడీకి అందిన రహస్య పత్రాల ప్రకారం కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు (2007 ? 2012) బిడ్‌ను దస్సాల్ట్ గెలుచుకోగా, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వంలోని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలో ఒప్పందం ఖరారైనట్లు మీడియాపార్ట్ తెలిపింది. అయితే రాఫెల్ డీల్‌లో 2015 నుంచి అనుమానాస్పద లావాదేవీల కార్యాచరణ జరిగినట్లు 2018 అక్టోబర్ 4న సీబీఐకి ఫిర్యాదు అందిందని ఆ పోర్టల్ పేర్కొంది.అనంతరం ఏడు రోజులకు అంటే 2018 అక్టోబర్ 11న ఈ డీల్ ముడుపులకు సంబంధించిన ఆధార పత్రాలు సీబీఐకి అందాయని, అయితే దీనిపై దర్యాప్తు చేయకూడదని ఆ సంస్థ నిర్ణయించిందని మీడియాపార్ట్ నివేదిక ఆరోపించింది. మరోవైపు 'రాఫెల్ పత్రాల'పై మీడియాపార్ట్ దర్యాప్తు నేపథ్యంలో ఈ డీల్‌లో జరిగిన అవినీతిపై ఈ ఏడాది జూలైలో న్యాయ విచారణకు ఫ్రాన్స్ ప్రభుత్వం ఆదేశించింది.

## ఒడిశా సీఎంతో చర్చించాల్సిన అంశాలపై సీఎం జగన్ సమీక్ష



అమరావతి: ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌తో మంగళవారం చర్చల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సీఎం జగన్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కాగా రేపు (09-11-2021) సీఎం జగన్ భువనేశ్వర్ వెళ్లనున్నారు. ఉభయరాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై మంగళవారం సాయంత్రం ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌తో చర్చలు జరపనున్నారు. ఈ సందర్భంగా మూడు అంశాలపై ఒడిశా సీఎంతో సీఎం జగన్ చర్చించనున్నారు. వంశధారపై నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం, జంఝావతి ప్రాజెక్టు, కొఠియా గ్రామాల అంశాలపై చర్చించనున్నారు.వంశధారపై నేరడి బ్యారేజీ నిర్మాణం నేరడి బ్యారేజీ కారణంగా ఉభయ రాష్ట్రాలకూ కలగనున్న ప్రయోజనాలను సీఎం జగన్ వివరించనున్నారు.

బ్యారేజీ నిర్మాణానికి ఒడిశా వైపునుంచి 103 ఎకరాలు అవసరమని ఇందులో 67 ఎకరాలు రివర్‌బెడ్ ప్రాంతమేనని అధికారులు తెలిపారు. బ్యారేజీ నిర్మాణం వల్ల ఒడిశావైపు కూడా సుమారు 5?6 వేల ఎకరాలకు తక్షణమే సాగునీరు అందుతుందని అధికారులు తెలిపారు.జంఝావతి ప్రాజెక్టు అంశం ప్రస్తుతం రబ్బర్ డ్యాం ఆధారంగా సాగునీరు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. 24,640 ఎకరాల్లో కేవలం 5 వేల ఎకరాలకు మాత్రమే నీరు ఇవ్వగలుగుతున్నామని, ప్రాజెక్టు పూర్తిచేస్తే రైతులకు పూర్తిస్థాయిలో మేలు జరుగుతుందని పేర్కొన్నారు ప్రాజెక్టును పూర్తిచేస్తే ఒడిశాలో 4 గ్రామాలు పూర్తిగా, పాక్షికంగా 6 గ్రామాలు ముంపునకు గురవుతాయని అధికారులు పేర్కొన్నారు. ఒడిశాలో దాదాపు 1174 ఎకరాల భూమి ముంపునకు గురవుతుందని తెలిపిన అధికారులు.ఇందులో 875 ఎకరాలు ప్రభుత్వ భూమేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్అండ్ఆర్‌కు సహకరించాలని ఏపీ ఒడిశాను కోరనుంది. కొఠియా గ్రామాల వివాదానికి సంబంధించిన మొత్తం వివరాలను అధికారులు సీఎం ముందు ఉంచారు. కొఠియా గ్రామాల్లో ఇటీవల పరిణామాలను వివరించారు.21 గ్రామాల్లో 16 గ్రామాలు ఏపీతోనే ఉంటామంటూ తీర్మానాలు చేసి ఇచ్చారని విజయనగరం జిల్లా కలెక్టర్ సూర్యకుమారి సీఎంకు వివరించారు. ఇటీవల ఆయా గ్రామాల్లో ఎన్నికలు కూడా నిర్వహించామని సమావేశంలో అధికారులు పేర్కొన్నారు.కొఠియా గ్రామాల్లో దాదాపు 87శాతానికి పైగా గిరిజనులు ఉన్నారని, వారికి సేవలు అందించే విషయంలో అవాంతరాలు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని సమావేశంలో అధికారులు ప్రస్తావించారు.ఈ సమావేశంలో సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, డీజీపీ గౌతం సవాంగ్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్, జలవనరులశాఖ కార్యదర్శి జె శ్యామలరావు, జలవనరులశాఖ ఈఎన్‌సి సి నారాయణరెడ్డి, విజయనగరం జిల్లా కలెక్టర్ ఎ సూర్య కుమారి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పెట్రో ధరలను తగ్గించే ప్రసక్తే లేదు: బుగ్గన



న్యూఢిల్లీ: పెట్రో ధరలను తగ్గించే ప్రసక్తే లేదని, పెట్రో ధరల తగ్గింపుకు కేంద్రానికి ఉన్న వెసులుబాటు రాష్ట్రాలకు ఉండదని ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన సోమవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అన్ రాక్ ఆర్బిట్రేషన్ పరిష్కారానికి సంబంధించిన అంశాలపై కేంద్రమంత్రితో చర్చించానన్నారు. నూతనంగా ఆర్థిక శాఖ సహాయ మంత్రులుగా నియమించబడిన మంత్రులు భగవత్ కరాడ్, పంకజ్ చౌదరిని మర్యాద పూర్వకంగా కలిశాన న్నారు. సహాయ మంత్రులకు రాష్ట్ర పరిస్థితులు వివరించినట్లు చెప్పారు. పెట్రోల్ డీజిల్ ధరలపై రాష్ట్ర నిర్ణయం ఇప్పటికే తెలిపామని, రాష్ట్ర ఆర్థిక వనరుల పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని బుగ్గన అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై ఆచితూచి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రానికి ఉండే ఖర్చులు వేరు.. కేంద్రానికి ఉండే ఖర్చులు వేరని, ఇప్పటికే పెంచిన పన్నులను కొంత తగ్గించామన్నారు. రాష్ట్రానికి పెట్రోల్, ఎక్సైజ్ ద్వారా మాత్రమే ఆదాయం వస్తుందని, కేంద్రం తీసుకున్నంత సులభంగా రాష్ట్రాలు నిర్ణయం తీసుకునే పరిస్థితి లేదని మంత్రి బుగ్గన వ్యాఖ్యానించారు.

## బోర్డును నియమించే హక్కు ఎవరికుంది: పవన్ ఫైర్



అమరావతి: టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు జనసేన అండగా ఉంటుందన్నారు. 2010లో కాంట్రాక్ట్ ఉద్యోగులను సొసైటీలుగా ఏర్పాటు చేసుకోవాలని టీటీడీ సూచించిందని గుర్తు చేశారు. ఇంకా పవన్ మీడియాతో మాట్లాడుతూ.. "కొత్తగా ఇప్పుడు కార్పోరేషన్ ఎందుకు? వ్యవస్థలను మార్చే సమయంలో జాగ్రత్త వహించాలి. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సుప్రీంకోర్టు 2016లో వెలువరించిన తీర్పును పూర్తిగా విస్మరించారు. కార్పొరేషన్‌లో చేరని ఉద్యోగులను బెదిరిస్తున్నారు. కొత్తగా కార్పొరేషన్ ఏర్పాటు.. నిధులు దారి మళ్లించేందుకేనా? బోర్డును నియమించే హక్కు ఎవరికుంది? ఈ ప్రక్రియలో పారదర్శకత ఉందా? 73 సొసైటీలలో ఉన్న నాలుగు వేల మంది ఉద్యోగులను ఒప్పించ లేకపోయిందా? నాలుగు వేల మంది ఉద్యోగులకు వైసీపీ పాదయాత్రలో ఎందుకు హామీలు ఇచ్చింది.

## మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన: చంద్రబాబునాయుడు



అమరాంతి: రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంక్‌ల వద్ద మంగళవారం 12 గం.ల నుంచి 1 గం. వరకు నిరసన కార్యక్రమం చేయాలని టీడీపీ కార్యకర్తలకు ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ పూర్తిగా రద్దు చేస్తామని పాదయాత్రలో జగన్ రెడ్డి హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేసారు. హామీ ప్రకారం పెట్రోల్‌పై రూ.16, డీజిల్‌పై రూ.17 తగ్గించాలని ఆయన డిమాండ్ చేసారు. పక్క రాష్ట్రాల్లో తగ్గించినా, మన రాష్ట్రంలో మొండిచేయి చూపారన్నారు. జగన్ రెడ్డి అవినీతి, దుబారా, చేతకాని పరిపాలనా విధానాలతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని ఆయన ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్న రాష్ట్రానికి పరిశ్రమలు రావు, ఉద్యోగాలు, ఉపాధి రాదన్నారు. అధిక డీజిల్ ధరల కారణంగా ట్రాక్టర్, నూర్పిడి ఖర్చులు పెరిగి వ్యవసాయం దెబ్బతింటుందన్నారు. అధిక పెట్రోల్ ధరల కారణంగా ఉద్యోగులు, కార్మికులు, చిరు వ్యాపారులు దెబ్బతింటారన్నారు. లారీల యజమానులు, కార్మికులు దెబ్బతినడమే కాక రవాణ ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు తారాస్థాయికి చేరతాయన్నారు. పెట్రో భారాలకు ప్రభుత్వ దోపిడీ, దుబారాలే కారణమని ఆయన దుయ్యబట్టారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో పెట్రోల్ ధరలు ఉన్నాయన్నారు. దేశంలో అధికంగా పెట్రోల్ ధర రూ.110.98కి పెంచారు. కరోనా కష్టాల్లో ఉన్న కుటుంబాలపై పెట్రో భారం పిడుగుపాటుగా మారిందని చంద్రబాబునాయుడు ఆవేదన వ్యక్తం చేసారు.

## చంద్రబాబుకి వయసుకు తగ్గ సంస్కారం లేదు: మంత్రి పెద్దిరెడ్డి



చిత్తూరు: చంద్రబాబుకి వయసుకు తగ్గ సంస్కారం లేదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. కుప్పం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబుకి తనపై తనకు నమ్మకంలేదని విమర్శించారు. బాబు.. తన తాబేదార్లతో మాట్లాడించుకోవడం తగ్గించుకోవాలని.. లేకుంటే అదే స్థాయిలో సమాధానం చెబుతామని మంత్రి పెద్దిరెడ్డి హితవు పలికారు.కుప్పం నియోజక వర్గంలో బాబు చేసిన అభివృద్ధి శూన్యం అని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల తర్వాత బాబు.. కుప్పం వచ్చే పరిస్థితి ఉండదని మంత్రి పెద్దిరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

అమరావతి: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి కొనసాగుతున్నది. రాగల 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో బుధ, గురువారాల్లో దక్షిణకోస్తాలో అక్కడక్కడ అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. రాయలసీమలో పలుచోట్ల భారీ



వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.

# సంపాదకీయం

మంగళవారం 09 నవంబరు 2021

## ఖర్చుల్లో రికార్డు సృష్టించిన హుజురాబాద్ ఉప ఎన్నిక

ఎన్నికలు కాస్ట్లీ అయ్యాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎలక్షన్స్ అనే తేడా లేకుండా అన్నీ ఖరీదైపోయాయి. ఎన్నికలంటేనే డబ్బులు పంచుడు, దావతులిచ్చుడు, ఓట్లు కొనుడు.. అన్నట్లు అయిపోయింది. డబ్బులు పంచడం ఏ స్థాయికి చేరిందంటే.. మాకు నోట్లు అందలేదంటూ కొంతమంది బహిరంగంగా రోడ్లపైకి వచ్చి మరీ ఆందోళనకు దిగే వరకు వెళ్లింది. "మాకెందుకు ఇవ్వరు?" అని సగటు ఓటరే నిలదీసిన వార్తలు చూస్తూనే ఉన్నాం. సామాన్యులు కనీసం ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితులు వచ్చేశాయి. ఈ పరిస్థితికి మొన్నటి హుజూరాబాద్ బై ఎలక్షన్సే మోడల్‌గా చూపించవచ్చు. దేశంలో ఎక్కడా లేని విధంగా హుజూరాబాద్ బై ఎలక్షన్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పులివెందుల బైపోల్ పేరు మీద ఉన్న రికార్డు బద్దలైంది. దీంతో వచ్చే ఎన్నికల్లో అయ్యే ఖర్చుపై లీడర్లలో ఇప్పటి నుంచే ఆందోళన మొదలైంది. కాస్ట్లీ ఎన్నికలపై సోషల్ మీడియాలో సైతం పోస్టులు, మీమ్స్‌తో సెటైర్స్ వేస్తూ నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. హుజూరాబాద్ బైపోల్‌లో పార్టీలు ఎడాపెడా డబ్బులు కుమ్మరించాయి. ఉప ఎన్నిక పేరుతో మొత్తంగా దాదాపు వెయ్యి కోట్లు ఖర్చు అయింది. ముఖ్యంగా ఎన్నికను చావో, రేవో అనే పద్ధతిలో తీసుకున్న ఓ పార్టీ 800 కోట్ల రూపాయలు, మరో పార్టీ 200 కోట్లు ఖర్చు పెట్టినట్టు తెలుస్తోంది. నియోజకవర్గంలోని 2.37లక్షల ఓటర్లలో సుమారు రెండు లక్షలమందికి ఒక్కో ఓటుకు ఆరువేల రూపాయల చొప్పున పంచినట్లు ప్రచారం సాగింది. డబ్బును సీల్డ్ కవర్‌లో పెట్టి మరీ పంచారు. ఒక ఇంట్లో ఎన్ని ఓట్లు ఉంటే.. ఆ నెంబర్‌ను వేసి, కవర్‌లో పెట్టి ఇచ్చారు. ఈ లెక్కన పంచినవే 120 కోట్ల రూపాయలు. పోలింగ్‌కు ముందు జస్ట్ ఒక్క రోజులో ఓ పార్టీ 100 కోట్ల రూపాయలకు పైగా పంచింది. మరో పార్టీ నియోజకవర్గంలోని దాదాపు ఓటర్లందరికీ ఓటుకు1,500 రూపాయల చొప్పున ముట్టజెప్పింది. అంటే 35 కోట్ల రూపాయలు పంచిపెట్టింది. ఇవి కాకుండా, పార్టీలు ప్రతి ఇంటికీ మందు బాటిళ్లను పంచాయి. ఇతర పార్టీల నాయకులను తమ పార్టీలోకి ఆహ్వానించడానికి, పార్టీలో ఉన్న వాళ్లు వెళ్లకుండా కాపాడుకోవడానికి భారీగా తాయిలాలు సమర్పించుకున్నాయి. సభలు, సమావేశాలు, ప్రచారం, హంగూ ఆర్భాటాలు, గిఫ్టులు ఇలా అనేక రకాలుగా విచ్చలవిడిగా కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2011లో జరిగిన కడప పార్లమెంట్, పులివెందుల అసెంబ్లీ ఉప ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో డబ్బులు ఖర్చు చేశారు. అన్ని పార్టీలు కలిపి కడప స్థానానికి 250 కోట్ల రూపాయలు, పులివెందులకు 150 కోట్ల రూపాయలు కుమ్మరించాయి. ఈ రెండు ఎన్నికలకు కలిపి అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 200 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టింది. ఇవే విషయాలను సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ కూడా స్పష్టం చేసింది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఓడించేందుకు కాంగ్రెస్ విశ్వ ప్రయత్నాలు చేసినా ఆఖరికి హస్తం పార్టీ ఓటమిని చవి చూసింది. అయితే కడప, పులివెందుల తర్వాత ఇప్పుడు వెయ్యి కోట్లతో హుజూరాబాద్ బైపోల్ ఆ రికార్డు బద్దలు కొట్టింది.ప్రపంచంలో అమెరికా ఎన్నికలను చాలా కాస్ట్?లీవిగా భావిస్తారు. 2020లో జరిగిన అమెరికా ప్రెసిడెంట్ ఎన్నికలు అత్యంత ఖరీదైనవిగా రికార్డులకెక్కాయి. ఆ ఎన్నికల్లో అక్కడి పార్టీలు దాదాపు లక్షా మూడు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశాయి. 2012, 2016 రెండు ఎన్నికల ఖర్చును కలిపినా ఈ ఎన్నికల ఖర్చు కంటే తక్కువే. 2016 ఎన్నికలతో పోలిస్తే 2020లో ఖర్చు రెండింతలు అయిందని సెంటర్? ఫర్ రెస్పాన్సివ్ పొలిటిక్స్ అనే సంస్థ తెలిపింది. ఇందులో రిపబ్లికన్ల కంటే డెమొక్రాట్లకే అత్యధికంగా విరాళాలు అందడంతో ఆ పార్టీనే ఎన్నికల్లో ఎక్కువగా ఖర్చు చేసింది. దేశంలో 2019లో జరిగిన లోక్ సభ ఎన్నికలతో పాటు వేర్వేరు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కలిసి 55,000 కోట్ల నుంచి రూ.60,000 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినట్లు సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ తెలిపింది. ఇది 2014 ఎన్నికల ఖర్చుతో పోల్చితే 40 శాతం ఎక్కువని ఆ సంస్థ రీసెర్చ్‌లో తేలింది. ఎన్నికలు సజావుగా జరగడానికి ఎన్నికల కమిషన్ పెట్టిన ఖర్చుతో పాటు అభ్యర్థులు చేసిన ఖర్చు, తాయిలాలను కూడా ఇందులో లెక్క పెట్టినట్లు చెప్పింది. ఈ లెక్కల ప్రకారం ఒక్కో నియోజకవర్గంలో పార్టీలన్నీ కలిసి 100 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినట్లు తేల్చింది. 1998 –? 2019 మధ్య ఆరు రెట్లు ఖర్చు పెరిగిందని తెలిపింది.ఎన్నికల్లో ఖర్చుకు సంబంధించి ప్రత్యేకంగా రూల్స్ ఉన్నాయి. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఒక స్థానానికి గరిష్టంగా 30.80లక్షల రూపాయల వరకు ఖర్చు చేయాలి. ఈ లిమిట్ గతంలో 28లక్షల రూపాయలు మాత్రమే ఉండేది. కరోనా వల్ల ఈ ఖర్చు పెంచారు. అయితే.. ఇవి అధికారికంగా ఖర్చు చేసే లెక్కలు మాత్రమే. ఎన్నికల ఖర్చుకు సంబంధించి ప్రతి క్యాండిడేట్ కచ్చితంగా పక్కాగా లెక్క చెప్పాలి. నామినేషన్ దాఖలు చేసిన తేదీ నుంచి ఎలక్షన్ రిజల్ట్స్ ప్రకటించే తేదీ వరకు పద్దును ఎన్నికల సంఘానికి అందించాలి. ప్రతి కేండిడేట్ ప్రత్యేకంగా ఒక బ్యాంకు ఖాతా తెరవాలి. ప్రతి లావాదేవీ చెక్కుల రూపంలోనే ఉండాలనేది ఎలక్షన్? కమిషన్? పెట్టిన కట్టుబాటు. కానీ.. ఇలా చేసే అభ్యర్థులు చాలా తక్కువ. నిజానికి ఒక అభ్యర్థి తరపున పెట్టే ఖర్చు, పంచే సొమ్ము నేరుగా అతడే స్వయంగా ఇవ్వకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. కాగా ఎంపీగా పోటీ చేసే అభ్యర్థి ఖర్చును రూ. 70లక్షల నుంచి రూ. 77లక్షల వరకు పెంచారు. జనాభాను బట్టి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా ఈ రూల్స్ ఉన్నాయి. హుజూరాబాద్లో ఓటుకు ఆరు వేల రూపాయల చొప్పున పంచారనేది లెక్కలోకి తీసుకుంటే, ఒక్కో నియోజకవర్గానికి 120 కోట్ల రూపాయలు ఖర్చు చేయాలి. అంటే తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 119 నియోజకవర్గాలకు 15 వేల కోట్ల రూపాయల దాకా ఖర్చవుతుంది. జస్ట్ ఇవి ఓట్ల కోసం ఓటర్లకు పంచడానికి మాత్రమే. మరో ఐదు వేల కోట్లు ఇతర ఖర్చుల కోసం కావాలి. 2018 ఎన్నికల్లో ఒక్కో సీటుకు 25 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రకటించింది. ఓటుకు 100 నుంచి 200 ఇచ్చి, క్వార్టర్ సీసా ఇచ్చేవాళ్లు. ఇప్పుడు ఒక్క ఓటుకు ఆరు వేల రూపాయలు ఇవ్వడంతో వచ్చే ఎన్నికల్లోనూ ఓటర్లు ఇదే విధంగా డిమాండ్ చేసే అవకాశం ఉందని పొలిటికల్ ఎనలిస్ట్‌లు చెబుతున్నారు. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, టికెట్ కోసం ప్రయత్నాలు చేయాలనుకునే వాళ్లు వందల కోట్లు ఎక్కడి నుంచి తేవాలని ఇప్పటి నుంచే జంకుతున్నారు. ఇంత ఖర్చు ఎట్లా భరించాలని భయపడుతున్నారు.బరిలో ఉన్న పార్టీలు ఖర్చు పెట్టడంతో పాటు అధికార పార్టీ ప్రభుత్వ నిధుల ద్వారా లాభం పొందే ప్రయత్నం చేస్తున్నాయి. 'ముందు ముందు డబ్బు ఎక్కువ ఖర్చు పెట్టగలిగినవాళ్లే నాయకులు అనే పరిస్థితి వస్తే! ఏమైపోతుంది?

# వైసీపీ నేతల మధ్య విభేదాలు



నెల్లూరు, నవంబర్ 8, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లాలో వైసీపీ నేతల మధ్య విభేదాలు ముదురుతున్నాయి. మంత్రి వర్గ విస్తరణ సమయం దగ్గరపడుతున్న కొద్దీ వీరిలో గ్యాప్ మరింత పెరుగుతుంది. రెండు వర్గాలుగా విడిపోయారు. మంత్రుల పనితీరును వీరు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పనులపై వైసీపీ ఎమ్మెల్యేలే మంత్రులను నిలదీస్తున్నారు. తమకు ప్రాధాన్యత దక్కడం లేదంటూ కొందరు ఎమ్మెల్యేలు నేరుగానే విమర్శలు చేస్తున్నారు. నెల్లూరు జిల్లాలో వైసీపీకి ఇది ఇబ్బందికర పరిణామమే.నెల్లూరు జిల్లాలో గత ఎన్నికల్లో వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. అందరూ సీనియర్ నేతలే. అధిక భాగం రెడ్డి సామాజికవర్గం నేతలే. వీరంతా ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నారు. వీరిలో మంత్రి అనిల్ కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఒకవర్గంగానూ, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి మరొక వర్గంగా కన్పిస్తుంది. త్వరలో జరగబోయే మంత్రి వర్గం విస్తరణలో వీరంతా ఆశలు పెట్టుకున్నారు.మరో మంత్రి మేకపాటి గౌతం రెడ్డి మాత్రం అందరిని కలుపుకుని పోయే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో మరోసారి వైసీపీ ఎమ్మెల్యేలను తమ గొంతును పెంచారు. ఆనం రామనారాయణరెడ్డి బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని అధికారులను నిలదీశారు. ఇళ్లస్థలాలను చదును చేసి అభివృద్ధి చేసినా ఇంతవరకూ బిల్లులు చెల్లించలేదని, ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లెవరూ ముందుకు రావడం లేదని ఆనం రామనారాయణరెడ్డి ఫైరయ్యారు.గత కొంతకాలంగా ఆనం రామనారాయణరెడ్డి అధికారుల తీరుపై అసంతృప్తితో ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యేలను పట్టించుకోకుండా అధికారులు మంత్రుల మాటకే విలువనిస్తున్నారని ఆయన అనేకసార్లు ఇదివరకే ఆరోపించారు. ఇదే సమావేశంలో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సయితం అధికారుల తీరుపై ఫైర్ అవ్వడం విశేషం. పట్టాలు ఇచ్చినా లే అవట్ ఎత్తు పెంచకపోవడంతో ఇబ్బందికరంగా మారిందని, నాలుగుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని ఆయన ఆరోపించారు. ఇలా నెల్లూరు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు రెండు వర్గాలుగా విడిపోయారన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# ఉండవల్లి వ్యూహాత్మకంగా సైడ్...



రాజమండ్రి, నవంబర్ 8, (న్యూస్ పల్స్)పార్టీ సీనియర్ నేత ఉండవల్లి అరుణ్ కుమార్ ను వైసీపీ వ్యూహాత్మకంగా సైడ్ చేయాలని నిర్ణయించినట్లుంది. ఉండవల్లి కున్న క్రెడిబులిటీ దృష్ట్యా ఆయన జోలికి వెళ్లకపోవడమే మంచిదన్న అభిప్రాయంలో వైసీపీ ఉంది. అందుకే ఆయన ప్రభుత్వంపై ఎన్ని విమర్శలు చేసినా చూసీ చూడనట్లు వదిలేయడమే మంచిదన్న నిర్ణయానికి వైసీపీ వచ్చినట్లుంది. దీనిపై వైసీపీ అధినాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు కింది స్థాయి నేతలకు కూడా అందాయి. ఉండవల్లి అరుణ్ కుమార్ కు ఒక ప్రత్యేకత ఉంది. ఆయన విమర్శలు అర్థవంతంగా, ఆధారసహితంగా ఉంటాయి. ఆయన మాటలను ప్రజలను కూడా విశ్వసిస్తారు. ఇటీవల ఉండవల్లి అరుణ్ కుమార్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలే చేశారు. వైసీపీ ప్రభుత్వం శక్తికి మించి అప్పులు చేస్తుందన్నారు. దూరదృష్టి లేకుండా అప్పులు చేస్తూ పోతున్నారని ఉండవల్లి అరుణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఇలాగే చేస్తూ పోతే ఏడాదికి నలభై వేల కోట్లు వడ్డీ రూపంలోనే చెల్లించాల్సి వస్తుందని కూడా ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కానీ ఎవరి విమర్శలపైనైనా వెంటనే సమాధానాలు చెప్పే వైసీపీ నేతలు ఉండవల్లి అరుణ్ కుమార్ విషయంలో వెనక్కు తగ్గినట్లే కన్పిస్తుంది. ఆయన విమర్శలు చేసి నెల రోజులు గడుస్తున్నా నైస్ గా దానిని పక్కన పెట్టేశారు. ఇందుకు కారణాలు కూడా లేకపోలేదు. ఉండవల్లి అరుణ్ కుమార్ ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీలో లేరు. ఆయన ఏడాదిలో రెండు, మూడుసార్లు మాత్రమే మీడియా సమావేశాలు పెట్టి తన మనసులో మాటను చెబుతుంటారు.ఉండవల్లి అరుణ్ కుమార్ తాను చేసిన విమర్శలకు కౌంటర్ వస్తే వెంటనే మళ్లీ ఫైర్ అవుతారు. తాను చెప్పిన విషయాలతో పాటు అదనపు అంశాలను జోడించి మరీ ఎండగట్టే గుణం ఉండవల్లి అరుణ్ కుమార్ కు ఉంది. అందుకే ఉండవల్లి జోలికి వెళ్లకపోవడమే మంచిదన్న అభిప్రాయంలో వైసీపీ అధినాయకత్వం ఉంది. ఆయన విమర్శలను చూసీ చూడనట్లు వదిలేస్తేనే మంచిదన్న అభిప్రాయానికి వచ్చింది. అందుకే ఆయన రాష్ట్ర అప్పులు మీద చేసిన ఆరోపణలపై ఏ ఒక్క వైసీపీ నేత రెస్పాండ్ కాలేదు.

# లోకేష్ లెక్కేంటీ...



విజయవాడ, నవంబర్ 8, (న్యూస్ పల్స్) పార్టీని ముంచినా తేల్చినా లోకేషేనట. నారా లోకేష్ పై నాయకుల్లోనే నమ్మకం ఏర్పడటం లేదు. పార్టీని నడిపించడం ఆయన వల్ల కాదని అనేక మంది నేతలు తేల్చేశారు. విపక్షంలో ఉన్న సమయంలో నాయకుడిగా ఎదగాల్సి ఉన్నా లోకేష్ లో ఆ ఫైర్ లేదన్నది వాస్తవం. ఎప్పుడో ఒకసారి వచ్చి ఏదో మాట్లాడేసి హైదరాబాద్ లో ఉండటం తప్ప లోకేష్ ఈ రెండున్నరేళ్లలో పార్టీని బలోపేతం చేయడం కోసం ఆయన చేసిన ప్రయత్నాలు స్వల్పమేనని చెప్పాలి.పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎటూ నాయకుడిగా ఎదగలేకపోయారు. మంత్రిగా బాధ్యతలను స్వీకరించి ఆయన నాలుగు గోడలకే పరిమితమయ్యారు. ఇక తాను ఓటమి చెందడమే కాకుండా, పార్టీ అధికారాన్ని కోల్పోయినప్పుడు నిత్యం జనంలో ఉండేలా చూసుకోవాలి. కానీ లోకేష్ ఎప్పుడూ రెస్ట్ మోడ్ లో ఉంటాడన్నది పార్టీ నేతల నుంచి విన్పిస్తున్న టాక్. లోకేష్ జనంలోకి వెళ్లేందుకు కాని, కార్యకర్తలను కలిసేందుకు కాని పెద్దగా ప్రయత్నించరు.నారా లోకేష్ కేవలం పరామర్శలకే పరిమితమయ్యారు. తండ్రి 70 పదుల వయసులో 36 గంటలు దీక్ష పార్టీని కాపాడుకునే ప్రయత్నం చేస్తుంటే కనీసం జిల్లాల్లో పర్యటించి పార్టీని గాడిన పెట్టేందుకు కూడా చినబాబు ట్రై చేయడం లేదు. పైగా నారా లోకేష్ పై పార్టీలో మరో భయం ఉంది. అభ్యర్థుల ఎంపిక కూడా ఆయన ఇష్ట ప్రకారమే జరుగుతుందని, పార్టీ అధికారంలోకి వస్తే మంత్రులను కూడా లోకేష్ నిర్ణయిస్తారన్న టాక్ ఉంది.దీంతో చంద్రబాబు కు సీనియర్ నేతలు ఇప్పటికే చెప్పారు. లోకేష్ భాగస్వామ్యం తక్కువ ఉండేలా చూడాలని కోరారు. జిల్లాల్లో నారా లోకేష్ ను పర్యటింప చేసి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నించాలని, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కూడా కొందరు కోరుతున్నారు. కానీ నారా లోకేష్ మాత్రం ఎక్కువ సమయం హైదరాబాద్ కే పరిమితమవుతున్నారు. ఏపీకి చుట్టపుచూపుగా వచ్చి పోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మొత్తం మీద నారా లోకేష్ రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలోనే పార్టీ నేతలు, క్యాడర్ లోనే నమ్మకాన్ని కల్గించుకోలేకపోతున్నారు

ఉత్తరాంధ్ర నుంచి సైకిల్ యాత్ర

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సైకిల్ యాత్రకు సిద్ధమవుతున్నారు. ఆయన ఉత్తరాంధ్ర నుంచే తన సైకిల్ యాత్రను ప్రారంభించే అవకాశాలున్నాయి. ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన నియోజకవర్గాల మీదుగా కొనసాగే అవకాశాలున్నాయి. 2024 ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ సిద్ధమవుతుంది. పార్టీ అధినేత చంద్రబాబు ఇప్పటికే తాను యాత్ర ప్రారంభిస్తానని చెప్పారు. బహుశ ఆయన బస్సు యాత్ర చేపట్టే అవకాశాలున్నాయి. చంద్రబాబు యాత్ర సీమ జిల్లాల నుంచి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.దీంతో పాటు నారా లోకేష్ సయితం యాత్రకు సిద్ధమవుతున్నారు వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ యాత్ర ఉండే అవకాశాలున్నాయి. వీలయినన్ని ఎక్కువ నియోజకవర్గాలను కవర్ చేసేలా లోకేష్ యాత్ర రూట్ మ్యాప్ రూపొందుతుంది. రోజుకు ముప్ఫయి కిలోమీటర్ల మేరకు యాత్ర కొనసాగే అవకాశాలున్నాయి. ఈ యాత్ర కడప జిల్లాలో ముగిసేలా రూట్ మ్యాప్ ను రూపొందించినట్లు సమాచారం. మార్చి నెలలో ఈ యాత్ర ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.నారా లోకేష్ పార్టీలో మరింత పట్టు సంపాదించుకునేందుకు ఈ యాత్ర ఉపయోగపడనుంది. లోకేష్ నాయకత్వంపై ఇప్పటికీ టీడీపీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగా చెప్పకపోయినప్పటికీ చంద్రబాబు నాయకత్వమే కొనసాగాలని ఎక్కువ మంది కోరుకుంటున్నారు. వచ్చే ఎన్నికలకు చంద్రబాబు మాత్రమే నాయకత్వం వహించినా, లోకేష్ కూడా పార్టీలో తన ప్రాధాన్యతను గుర్తించాలని సైకిల్ యాత్రను ఎంచుకున్నట్లు చెబుతున్నారు.వైసీపీ ప్రభుత్వం గత మూడేళ్లుగా అనుసరిస్తున్న విధానాలను తన సైకిల్ యాత్ర ద్వారా ప్రజల ముందు ఉంచాలని నారా లోకేష్ డిసైడ్ అయ్యారు. పార్టీ విజయం సాధిస్తే తాను కూడా కీలక భూమిక పోషించానని చెప్పుకోవడానికి ఈ యాత్ర లోకేష్ కు ఉపకరిస్తుంది. అందుకోసమే ఆయన సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టనుంది. స్థానిక సమస్యలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న వివిధ సమస్యలతో తన యాత్ర ద్వారా లోకేష్ ప్రజల్లోకి వెళ్లనున్నారు.

# జనసేన, టీడీపీ కలిసే పోటీనా..



విజయవాడ, నవంబర్ 8, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో పరిణామాలకు అనుగుణంగానే పార్టీలు మారాల్సి ఉంటుంది. ఒకే పార్టీని నమ్ముకుని కూర్చుంటే అధికారం దక్కదు. ఈ విషయం ఏపీ రాజకీయ నేతలకు తెలిసినంతగా ఎవరికీ తెలియదనే చెప్పాలి. ఎన్నికలకు ముందు వలసలు ఎక్కువగా ఏపీలోనే ఉంటాయి. ఇప్పుడు మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ మరో పార్టీలోకి వెళుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. ఆయన త్వరలోనే జనసేన పార్టీలోకి వెళతారంటున్నారు.జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు వచ్చే ఎన్నికల్లో అన్ని సామాజికవర్గాల అండ కావాల్సి ఉంటుంది. ఇప్పటికే జనసేనలో నాదెండ్ల మనోహర్ కు కీలక పదవి ఇచ్చారు. ఇక కామినేని శ్రీనివాస్ ను కూడా తీసుకుని పార్టీలో కీలక పదవి ఇవ్వాలన్నది పవన్ కల్యాణ్ ఆలోచనగా ఉంది. ఆయనకు కండువా కప్పి ప్రధానంగా కృష్ణా జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.కామినేని శ్రీనివాస్ తొలుత ఎన్టీఆర్ టీడీపీ పెట్టినప్పుడు ఆ పార్టీలో చేరారు. తర్వాత చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు ఆ పార్టీలో చేరి కీలకంగా మారారు. నిజాయితీ ఉన్న నేతగా కామినేని శ్రీనివాస్ కు పేరుంది. ఆయన రాజకీయాలు కూడా పారదర్శకంగా ఉంటాయి. 2014 ఎన్నికలకు ముందు బీజేపీలో చేరి తర్వాత టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం బీజేపీలో ఉన్నారు. అయితే జనసేన, బీజేపీ పొత్తు ఉంది. ఆయన నిజానికి పార్టీ మారాల్సిన అవసరం లేదు.కామినేని శ్రీనివాస్ ఇప్పుడు బీజేపీలో పెద్దగా యాక్టివ్ గా లేని మాట వాస్తవమే. కానీ ఇప్పుడు జనసేనలో చేరాలన్న ఆలోచనను కామినేని శ్రీనివాస్ చేశారంటే బీజేపీ, జనసేనకు విడాకులు తప్పేట్లు లేవన్న చర్చ జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలసి పోటీ చేస్తాయన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన బీజేపీ నుంచి జనసేనలో చేరితే ఆ ప్రచారానికి మరింత క్లారిటీ వస్తుంది. మొత్తం మీద జనసేనలో కామినేని శ్రీనివాస్ చేరతారన్న ప్రచారమయితే బాగానే జరుగుతుంది.

## కపిల తీర్థం నుంచి రామతీర్థం.... ఆగినట్టేనా

విజయవాడ, నవంబర్ 8, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీపై అనేక సందేహాలు వస్తున్నాయి. అసలు పార్టీ నిలదొక్కుకోవడానికి ప్రయత్నాలు చేయడం లేదన్న విమర్శలున్నాయి. కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం, మీడియా సమావేశాలు మినహా ఆ పార్టీ నేతలు చేస్తున్నదేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇంకా ఎన్నికలకు మూడేళ్లు మాత్రమే సమయం ఉంది. ఈ పరిస్థితుల్లో అధికార పార్టీపై దూకుడుగా వ్యవహరించాల్సిన బీజేపీ కేవలం ఉప ఎన్నికలకే పరిమితమయిందన్న ఆరోపణలు విన్పిస్తున్నాయిపొరుగున ఉన్న తెలంగాణలో బీజేపీ నేతలు పార్టీని బలోపేతం చేయడం కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఉప ఎన్నిక మాత్రమే కాదు మిగిలిన సమయాల్లో ఆందోళనలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఏకంగా పాదయాత్ర చేశారు. ఇక రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దీక్షలు, ఆందోళనలు చేయడంతో క్యాడర్ లో కూడా ఉత్సాహం నెలకొంది. మరోవైపు ఉప ఎన్నికల్లో కూడా అధికార పార్టీకి సవాల్ విసురుతుంది.తెలంగాణతో పోల్చుకుంటే ఏపీ బీజేపీ అసలు ఏం చేయడం లేదనే అనుకోవాలి. అప్పుడెప్పుడో దేవాలయంలో దాడులు, విగ్రహాల ధ్వంసం ఘటనలకు సంబంధించి తిరుపతి లోని కపిలతీర్థం నుంచి రామతీర్థం వరకూ పాదయాత్ర చేస్తామని బీజేపీ ఆర్భాటంగా ప్రకటించింది. తర్వాత దానిని వాయిదా వేసుకున్నారు. ఆ సమస్య కూడా కన్పించకుండా పోయింది. ఇక అమరావతి నుంచి బెజవాడ వరకూ పాదయాత్ర చేస్తామని ప్రకటించి మధ్యలోనే మానుకుంది.రాష్ట్రంలో సమస్యలేవీ లేవా? అంటే చాలా ఉన్నాయి. విపక్షాలు ఆందోళనకు దిగేందుకు చాలానే ఉన్నాయి. కేవలం అధికార పార్టీని ట్విట్టర్, మీడియా సమావేశాల్లో ప్రశ్నించడమే తప్ప జనంలోకి వెళ్లే ప్రయత్నాలు బీజేపీ చేయడం లేదు. దీనికి కేంద్ర నాయకత్వం నుంచి వచ్చిన ఆదేశాలు కూడా కారణం కావచ్చన్న వాదన కూడా ఉంది. మొత్తం మీద తెలంగాణతో పోల్చుకుంటే పార్టీ ఎదగడానికి ఏపీ బీజేపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు శూన్యమేనని చెప్పాలి

# కృష్ణ పట్నంలో ఆదానీ మార్క్...

నెల్లూరు, నవంబర్ 8, (న్యూస్ పల్స్)కృష్ణపట్నం పోర్టులో పనిచేస్తున్న కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. వాటాలన్నిటినీ సొంతం చేసుకున్న అదానీ గ్రూప్ మేనేజ్‌మెంటు కార్మికుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తోంది. కార్మిక చట్టాలు తనకేం పట్టనట్టుగా కార్మికుల వినతులను, ప్రభుత్వం చేసిన చట్టాలను చెత్తబుట్టకే పరిమితం చేస్తోంది. ప్రశ్నించిన కార్మికులను పనిలోంచి తొలగిస్తూ నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తోంది. పోర్టులో సుమారు 12 వేల మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. అత్యధికంగా కాంట్రాక్టు కార్మికులే ఉన్నారు. వీరిని సాధారణంగా కాంట్రాక్టు కార్మిక చట్టాల ప్రకారం అన్‌స్కిల్డ్, స్కిల్డ్, సెమీస్కిల్డ్, హైస్కిల్డ్‌గా గుర్తించి వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. కృష్ణపట్నం పోర్టులో 100 టన్నుల సామర్థ్యం, 18 గేర్లు కలిగిన భారీ వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను కూడా అదానీ గ్రూపు యాజమాన్యం సెమీస్కిల్డ్ కార్మికులుగానే గుర్తించింది. వారికి బేసిక్ వేతనం రూ.8 వేలు, ఇతర అలవెన్సులతో కలిపి రూ.12 వేలు మాత్రమే చెల్లిస్తోంది. వాస్తవానికి వీళ్లు హైస్కిల్డ్ కార్మికులు. చట్టం ప్రకారం వీరికి రూ.21,700 వేతనం రావాల్సి ఉంది. తమకు హైస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని పోర్టు యాజమాన్యానికి కార్మికులు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా చెత్తబుట్టకే పరిమితమయ్యాయి. తమకు చట్టం ప్రకారం వేతనాలు ఇవ్వాలని చట్టం ప్రతులను యాజమాన్యానికి ఇచ్చినా అవీ చెత్తబుట్ట దాఖలవుతున్నాయి.కృష్ణపట్నం పోర్టులో ఏ సెక్షన్‌లోనూ 8 గంటల పని విధానం కనబడటం లేదు. ఏ కార్మికుడైనా 12 గంటలు పని చేయాల్సిందే. 8 గంటలే పనిచేస్తామని ప్రశ్నించిన వారిని పనికి లేదా ఉద్యోగానికి రావాల్సిన పనిలేదని యాజమాన్యం నిర్మొహమాటంగా చెబుతోంది. కొన్ని సెక్షన్లలో అయితే 24 గంటల పనివిధానం నడుస్తోంది. ఒక కార్మికుడు 24 గంటలు పనిచేసి, మరుసటి రోజు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ రకమైన విధులు చేయాల్సిందేనని యాజ మాన్యం ఒత్తిడి తీసుకొచ్చి పనిచేయిస్తోంది. వీరికి అదనంగా ఒక్క రూపాయి కూడా వేతనంలో మార్పు ఉండదు. ఓటీకి రిజిస్టర్ ఉండాల్సి ఉండగా, దానిని కూడా యాజమాన్యం నిర్వహించడం లేదని సమాచారం. 13 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు వేతనాలు పెంచకుండా యాజ మాన్యం కఠినంగా వ్యవహరిస్తోంది. సుమారు 1500 మంది మహిళలను అన్‌స్కిల్డ్ కార్మికులుగా పేర్కొంటూ రోజుకు రూ.180 చొప్పున మాత్రమే వేతనం అందిస్తోంది. పోర్టు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వీరంతా పోర్టు వల్ల చేపల వేట లేక, వ్యవసాయం లేక, ఉపాధిలేక పోర్టులో చేరారు. వీరికి రోజుకు రూ.360 ఇవ్వాల్సి ఉండగా, రూ.180 మాత్రమే యాజమాన్యం ఇస్తోంది. మెషిన్ ఆపరేటర్లు, వివిధ విభాగాల్లో పనిచేసే కార్మికులు మొత్తం కాంట్రాక్టు పద్ధతిలోనే పనిచేస్తున్నారు. పోర్టు మొత్తమ్మీద 600 మంది మాత్రమే పర్మినెంటు ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం.పోర్టు యాజమాన్యం చేస్తున్న అన్యాయంపై కార్మికశాఖ కమిషనరుకు కార్మికులు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన నామమాత్రంగానే ఉంది. పోర్టు యాజమాన్యం, కార్మిక సంఘాలతో జాయింట్ మీటింగ్‌లను కార్మికశాఖ కమిషనరు నిర్వహిస్తున్నప్పటికీ యాజమాన్యం నుంచి రావాల్సిన సిఇఒ, అడ్మిన్ ఇన్‌ఛార్జి హాజరుకావడం లేదు. గుమస్తాకు ఒక లెటర్‌ను యాజమాన్యం ఇచ్చి పంపించడం ఆనవాయితీగా మారింది. హైస్కిల్డ్, సెమీస్కిల్డ్, స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులంటే ఎవరో తెలియని పరిస్థితుల్లో కార్మికశాఖ పనిచేస్తోందని కార్మికులు విమర్శిస్తున్నారు. సమస్యల్ని పరిష్కరించడంలో కార్మికశాఖ కమిషనరు చేతులెత్తేస్తున్నారని కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోర్టు యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 10న మరో మీటింగ్ ఉంది.

# డిఫాల్టర్ గా జెన్ కో...

విజయవాడ, నవంబర్ 8, (న్యూస్ పల్స్)ఒక ప్రభుత్వ రంగ సంస్థ డిఫాల్టర్‌గా మారడం అంటే అది ప్రభుత్వానికి అప్రతిష్టే. ఆ సంస్థలకు భవిష్యత్తులో కొత్త రుణాలు రావడం కూడా కష్టంగానే ఉంటుంది. తాజాగా అత్యంత కీలకమైన ఏపి జెన్‌కో ఆ అపప్రధను మూట గట్టుకుంటోంది. రుణ కిస్తీని సకాలంలో చెల్లించకపోవడంతో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్‌ఇసి) తన రికార్డుల్లో జెన్‌కో, రాష్ట్ర పవర్ డెవలప్‌మెరట్ కార్పొరేషన్లను ఎన్‌పిఏ (నిరర్థక అకౌంట్ల జాబితా)లోకి చేర్చినట్లు ప్రకటించడం గమనార్హం. ఈ మేరకు నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికే ఆర్‌ఇసి లేఖ రాసింది. ఇలా ఒక ప్రభుత్వ సంస్థను ఎన్‌పిఏలోకి చేర్చడం అన్నది ఇదే తొలిసారిగా అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ బకాయిలను వెంటనే చెల్లించకపోతే మరిన్ని కఠిన సమస్యలు తప్పవని జెన్‌కో అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ఆర్‌ఇసి నుంచి జెన్‌కో తీసుకున్న రుణాలు రూ.11,157 కోట్లు. వీటిల్లో రూ.405 కోట్లు అక్టోబర్ 31 నాటికి ఓవర్‌డ్యూస్‌గా మిగిలిపోయాయి. అలాగే పవర్ డెవలప్‌మెరట్ కార్పొరేషన్ కూడా తన మొత్తం బకాయిలు రూ.1270 కోట్లలో రూ.141 కోట్లు ఓవర్‌డ్యూస్‌గా మిగిలిపోయాయి. గడువునకు 90 రోజులు దాటినా చెల్లిరపులు లేకపోతే ఆ బకాయి పడిన సంస్థను ఎన్‌పిఏ జాబితాలోకి చేరుస్తారు. ఈ నేపథ్యంలోనే ఈ రెరడు సంస్థల ఖాతాలను తమ రికార్డుల్లో ఎన్‌పిఏగా నమోదుచేసినట్లు ఆర్‌ఇసి ప్రకటిరచిందిరుణాలను సకాలంలో తీర్చలేని నేపథ్యంలో భారీ బకాయిలను చెల్లించని వారిపై ప్రయోగించేందుకు కేంద్రం తయారుచేసిన ఐబిసి (ఇన్‌సాల్వెన్సీ అరడ్ బ్యారకరప్టసీ కోడ్)ను ప్రయోగించేందుకు కూడా ఆలోచిస్తామని ఆర్‌ఇసి ప్రకటించడం ఆందోళనకరం. ఎస్క్రో ఖాతాల విలువ తగ్గించడమే కాకుండా, ఇచ్చిన రుణాన్ని రద్దు చేయడం, గ్యారంటీల విలువ తగ్గించడం వంటి చర్యలకు ఉపక్రమించే అవకాశాలున్నాయని ఆర్‌ఇసి హెచ్చరించడం గమనార్హం. అలాగే కొత్త రుణాలు ఇవ్వడం సాధ్యం కాదని కూడా పేర్కొనడంతో అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓవర్‌డ్యూస్ నుంచి ఎన్‌పిఏకు మారిన రూ.536 కోట్లను తక్షణమే చెల్లించేందుకు మరో అవకాశం ఇస్తూ, లేని పక్షంలో చర్యలు తప్పవని కూడా ఆర్‌ఇసి హెచ్చరించడం విశేషం. ఇలా ఉండగా పవర్ ఫైనాన్స్ సంస్థకు జూలై నెలకు సంబంధించి మరో రూ.719 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీని 90 రోజుల గడువు కూడా ఇప్పటికే ముగిసిపోయింది. దీని తరువాత వరుసగా ఆగస్టు, సెప్టెంబర్ రుణ బకాయిలు కూడా రూ.925 కోట్లు క్యూలో ఉన్నాయి. వాటికి కూడా నిధులు విడుదల చేయాలని జెన్‌కో అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు

# 24 నియోజకవర్గాలపై దృష్టి

విజయవాడ, నవంబర్ 8, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ నియోజకవర్గ ఇన్ ఛార్జులతో సమావేశం కానున్నారు. గత ఎన్నికల్లో ఓటమి పాలయిన నియోజకవర్గాల నేతలో ప్రత్యేకంగా సమావేశం కావాలని నిర్ణయించారు. వీరితో మాట్లాడి అక్కడి క్షేత్ర స్థాయి పరిస్థితులను తెలుసుకోవాలని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో జగన్ పార్టీకి 24 స్థానాల్లో విజయం లభించలేదు. వీటిలో 23 నియోజకవర్గాల్లో టీడీపీ, ఒక దానిలో జనసేన గెలిచింది. ఈ 24 నియోజకవర్గాల్లో ఐదుగురు వైసీ?పీకి మద్దతుదారులుగా మారిపోయారు. అయినా సరే అక్కడి పరిస్థితులు ఏమీ బాగా లేవు. ఐదు నియోజకవర్గాల్లోనూ వైసీపీ నేతలు సహకరించడం లేదు. దీంతో పాటు మిగిలిన 19 నియోజకవర్గాల్లో కొన్ని ప్యాచ్ అప్ లు చేసినా అక్కడ వైసీపీ పుంజుకోలేదని సమాచారం రావడంతో ఈ 24 నియోజకవర్గాల పార్టీ నేతలో విడివిడిగా సమావేశం కావాలని నిర్ణయించినట్లు తెలిసిందిగుంటూరు వెస్ట్ లో మద్దాలి గిరి కి పోటీగా మరొక వర్గం సహకరించడం లేదు. అలాగే చీరాలలో ఆమంచి, కరణం వర్గీయుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. గన్నవరంలోనూ వంశీకి వ్యతిరేకంగా వైసీపీ నేతలు పనిచేస్తున్నారు. రాజోలులో మూడు వర్గాలు తయారయ్యాయి. విశాఖపట్నం సౌత్ లోనూ అంతే పరిస్థితి. ఇలా పార్టీకి మద్దతుదారులుగా నిలిచిన చోట కూడా వైసీ?పీ బలంగా లేదని గుర్తించారు. అదే సమయంలో హిందూపురం లాంటి చోట్ల వైసీపీ నేతలకు నామినేటెడ్ పదవులు ఇచ్చారు. అలాగే టెక్కలిలోనూ అదే ప్రయోగం చేశారు. మండపేట వంటి చోట ఎమ్మెల్సీ పదవులను ఇచ్చి ఇన్ ఛార్జిగా నియమించారు. మూడు చోట్ల ముగ్గురికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చినా ప్రయోజనం లేదని నివేదికలు అందుతున్నాయి. ఒక్క మండపేటలో మాత్రం కొంత బలం చేకూరింది. అయినా కొన్ని చోట్ల వైసీపీ బలోపేతం కాకపోవడంపై జగన్ అసహనంగా ఉన్నట్లు తెలిసింది. దీంతో వారితో ప్రత్యేకంగా మాట్లాడి అక్కడ సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు జగన్ సిద్ధమయ్యారని టాక్.

# జవాన్ల పై తోటి జవాన్ కాల్పులు..ముగ్గురు మృతి

రాయ్ పూర్ నవంబర్ 8, (న్యూస్ పల్స్)చత్తీస్ ఘఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా మారాయి గూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగంపల్లి బేస్ క్యాంప్ లో 50వ 50 బెటాలియన్ లోని ఒక పీఆర్పిఎఫ్ జవాన్ తోటి జవాన్ల్ పై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ముగ్గురు జవాన్లు మృతి చెందగా మరో నలుగురు జవాన్లు ధర్మాత్మా కుమార్, ధర్మేంద్ర, మహారణ, ధనుంజయ్. మృతి చెందిన జవాన్లు రాజాం మని యాదవ్(బిహార్), దంజి(బిహార్), రాజీవ్ మండల్(పశ్చిమ బెంగాల్) తీవ్రంగా గాయపడ్డారు. మృత దేహాలను భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన ఎందుకు జరిగింది అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. నిందిత జవాన్ ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

# ద్రాక్షారామంలో భక్తుల రద్దీ

కాకినాడ నవంబర్ 8, (న్యూస్ పల్స్)కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామునుంచి భక్తులు ఆలయానికి విచ్చేసి శ్రీ స్వామి వారిని,శ్రీ అమ్మ వారిని దర్శించుకున్నారు. శ్రీ భీమేశ్వర స్వామి వారికి అభిషేకాలు, శ్రీ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం శివన్నామస్మరణ తో మారు మ్రోగింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా ఆలయానికి తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవాదాయ, ధర్మాదాయ శాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు శీఘ్ర దర్శనం, సాధారణ దర్శనం కింద క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ ప్రాంగణంలోను, పైండా వారి సత్రం లోను ఉచిత భోజన ఏర్పాట్లు చేశారు. రామచంద్రపురం డిఎస్పీ బాల చంద్ర రెడ్డి ఆధ్వర్యంలో సిఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం రద్దు చేయాలి

## తహాశీల్దార్ వేణుగోపాల్ కు వినతిపత్రం

గోనెగండ్ల నవంబర్ 8, (న్యూస్ పల్స్) గోనెగండ్ల నవంబర్ 18 సోమవారం రోజు-జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం రద్దు చేయాలని టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ పి రంగముని, మాజీ యంపిపి కుర్వ బుడ్డప్ప, మాజీ ఎంపీటీసీ ఉల్లిగడ్డ రాముడు, డాక్టర్ మిన్నల్లా, సాగునీటి సంఘం అధ్యక్షులు దరగలమాబు,టీడీపీ సాంస్కృతిక జిల్లా విభాగ జిల్లా అధ్యక్షుడు కౌలుట్లయ్య నాయుడు, లు అన్నారు. ఈ కార్యక్రమానికి బివి జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1985నుంచి 2019వరకు మంజూరు అయిన పక్క గృహాలకు సంబంధించి సర్వేలు గ్రామ అధికారులు చేపట్టుతున్నారు. అప్పట్లో ప్రభుత్వం పేదలకు గుర్తించి గృహ నిర్మాణ కోసం నిధులు మంజూరు చేసింది. అయితే ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం 1985నుంచి 2019వరకు నిర్మించుకున్న గృహాలకు సంబంధించిన నిధులను ఓన్ టైం సెటిల్ మెంట్ (నీబిబ)క్రింద 10వేల నుంచి 20వేల వరకు చెల్లించాలని కొరుతు సర్వేలు చేస్తున్నారు. లబ్దిదారులు ఓటీఎస్ క్రింద డబ్బులు చెల్లించే సోమెత లేదు. కావున ప్రభుత్వం స్పందించి ఓటీఎస్ స్కీం రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఈ విషయం పై స్థానిక తహశీల్దార్ వేణుగోపాల్ కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో కడపల చిన్న వెంకటేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు, గంజిహళ్ళి గంజలయ్య, గౌండ రహుతుల్లా, హోటల్ వలి, కడపల భీమన్న, రజ్జబ్, మెరికాజ, జంగం శాంత, రవి,రాజ్ ,అక్బర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చి నగర పంచాయతీకి ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు కృషి

## నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి



నెల్లూరు నవంబర్ 8, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లా పరిధిలోని బుచ్చి నగర పంచాయతీని అందంగా తీర్చిదిద్దేందుకు నేను, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి కృషి చేస్తామని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. బుచ్చిలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చెప్పింది ఎన్నికల వాగ్దానం కాదని, బుచ్చి పై ఉండే అభిమానంతోనే నని చెప్పారు. బుచ్చిని నగరపంచాయతీ గా మార్చినందువల్ల అనేక లాభాలు కలుగుతాయని తెలిపారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చేందుకు తాను పూర్తి స్థాయిలో కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా పని చేసినందున ,స్థానిక సమస్యలపై కొంత అవగాహన ఉందని తెలిపారు. గతంలో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నెల్లూరు నుంచి బుచ్చికి సిమెంట్ రోడ్డు ఉండేదని గుర్తు చేశారు. ఇప్పుడు బుచ్చి వ్యాపార కేంద్రంగా కూడా అభివృద్ధి చెందిందని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని కనీవినీ ఎరుగని రీతిలో నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి విద్య ,వైద్య రంగాలకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. బుచ్చి లోని 20 వార్డులలోనూ వైసీపీని గెలిపించాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ ఛైర్మన్ రంగారెడ్డి, డీసీఎంఎస్ అధ్యక్షుడు వీరి చలపతి రావు ,మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, జడ్పిటీసీ మల్లు సుధాకర్ రెడ్డి, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న సంక్షేమ అభివృద్ధి పథకాలే వైకాపా అభ్యర్థుల విజయాలు

## 22 వ డివిజన్ వైకాపా అభ్యర్థి మూలె విజయభాస్కర్ రెడ్డి

నెల్లూరు నవంబర్ 8, (న్యూస్ పల్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే వైకాపా అభ్యర్థుల విజయాలని స్థానిక 22 వ డివిజన్ వైకాపా అభ్యర్థి నూనె విజయ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక డివిజన్ పరిధిలో తన విజయానికి సహకారం అందించాలని అభ్యర్థిస్తూ సోమవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆయన సోదరులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సూచనలు సలహాలు తోనూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల తోను డివిజన్ అభివృద్ధి ప్రజాసంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ నెల 15న జరగనున్న నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వం 2 సంవత్సరాలుగా పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు పలు విధాలుగా అవకాశం కల్పించారని రాష్ట్ర ప్రభుత్వ సేవలను కొనియాడారు. డివిజన్ పరిధిలోని సమస్యలను గుర్తించి ఆయా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ వైకాపా నాయకులు, కార్యకర్తలు, వైకాపా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 33వ డివిజన్ వైకాపా అభ్యర్థులు కరణం మంజుల విజయానికి కృషి

## వైకాపా నేత తలప నేని సురేష్ నాయుడు



నెల్లూరు నవంబర్ 8, (న్యూస్ పల్స్) నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో, నెల్లూరు గ్రామీణ నియోజవర్గ పరిధిలోని 33 వ డివిజన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కరణం మంజుల విజయానికి కృషి చేస్తామని స్థానిక వైకాపా నేత తలపనేని సురేష్ నాయుడు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని స్థానిక నేతాజీ నగర్ 8వ వీధి ప్రాంతంలో సోమవారం స్థానిక తలప నేని సురేష్ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం ప్రచార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 2 సంవత్సరాలుగా డివిజన్ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సేవలందిస్తున్న స్థానిక డివిజన్ ఇంచార్జి కరణం హాజరత్ నాయుడు సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా స్థానిక డివిజన్ వైకాపా అభ్యర్థిని కరణం మంజుల మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో, స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి బలపరిచిన అభ్యర్థినిగా స్థానిక ప్రజలు పూర్తి సహకారం అందించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని స్థానిక ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా స్థానిక డివిజన్ ఇంచార్జి కరణం హజరత్ నాయుడు మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు కరోనా వైరస్ నేపథ్యంలో తమ వంతు బాధ్యతగా కరోనా వైరస్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మేరకు స్థానిక ప్రజలు తన సతీమణి అయిన కరణం మంజులను ఆదరించి, విజయ ప్రధాన నడిపిస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నూర్ భాషా, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ కాలేశా, స్థానిక వైకాపా నాయకులు షేక్ మహిలిం భాషా, మరియు స్థానిక నాయకులు ,కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎం ఈ ఓ పై చర్యలు తీసుకోవాలి

## సిపిఎం డిమాండ్

విశాఖపట్నం నవంబర్ 8, (న్యూస్ పల్స్)డుంబ్రిగుడ మండలంలోని గసభ పంచాయతీ జంగిడి వలస గ్రామంలోని జిపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించడంలో నిర్లక్ష్యం చేస్తున్న స్థానిక మండల ఎం ఈ ఓ భారతి రత్న పై చర్యలు తీసుకోవాలని స్థానిక సిపిఎం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించక పోవడంతో సుమారు గత రెండేళ్ల నుంచి పాఠశాల మూతబడిందన్నారు. దీంతో ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విద్యకు దూరమయ్యారని చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టాగా వెంటనే డేప్యుటేషన్ పై ఉపాధ్యాయుడిని నియమించాలని ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారాన్నారు. అయితే పీవో ఆదేశాలిచ్చి సుమారు వారం రోజులు గడిచినా ఇప్పటికీ స్థానిక ఎంఈవో ఉపాధ్యాయుడిని నియమించ కపోవడం సరికాదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ గ్రామంలోనీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు డ్రాపౌట్ అయ్యి తమ భవిష్యత్తును పోగొట్టుకుంటున్నారన్నారు. తక్షణమే జంగిడి వలసలో ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు .లేనిపక్షంలో పాడేరు ఐటీడీఏను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి సూర్యనారాయణ, ఆ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాలుతో తంతే కష్టాలన్నీ కట్

పత్తికొండ నవంబర్ 8, (న్యూస్ పల్స్)నమ్మలేకపోతున్నారు కదూ.. అయితే, కర్నూలు జిల్లాలోని ఓ మారుమూల గ్రామానికి వెళ్లాల్సిందే. ఇక్కడ మహిళలు వరుసలో పడుకొని మరీ ఓ వ్యక్తి చేత కాలితో తన్నించుకుంటారు. అతను తన్ని 'పైకి లే' అనగానే కాళ్లకు నమస్కరించి దండాలు పెట్టేస్తారు. ఈ వింత ఆచారం బయటి వారికి మూఢ నమ్మకంగానూ, విడ్డూరంగా కనిపిస్తోంది. కానీ, గ్రామస్థులు మాత్రం భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పెద్దహుల్తి గ్రామంలో ఈ ఆచారం కొనసాగుతూ ఉంది. దీపావళి పండుగ గడిచిన మూడు రోజుల తర్వాత గ్రామ దేవుడు అయిన హుల్తిలింగేశ్వర స్వామి పండుగ జరుగుతుంది. ప్రతి సంవత్సరం కార్తీక మాసం మొదలుకాగానే రెండవరోజు పెద్దహుల్తి గ్రామంలో హుల్తిలింగేశ్వర స్వామి ఉత్సవాలు జరుతాయి. హుల్తిలింగేశ్వర ఉత్సవమూర్తి విగ్రహాన్ని మోస్తున్న వ్యక్తిలో స్వామి ఆవహిస్తారని గ్రామస్థులు తెలిపారు. ఈయన చేతిలో ఖడ్గం, స్వామివారి విగ్రహం తలపై మోసుకుని గ్రామంలో ఊరేగింపుగా గుడి దగ్గరకి వస్తారు. అక్కడికి రాగానే అప్పటికే స్వామి కొందరు భక్తులు తమ కష్టాలను తీర్చుకునేందుకు ఆ వ్యక్తితో తన్నించుకోవడం కోసం వరుస క్రమంలో నేలపై బోర్లా పండుకొని దండం పెట్టుకొని ఉంటారు. ఉద్యోగం రాని వారు, సంతానం లేని వారు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, అప్పులు ఉన్నవారు, ఇలా ఒక్కటి కాదు సమస్యలు ఏం ఉన్నా వారు బోర్లా పడుకుంటారు. హుల్తిలింగేశ్వర స్వామి అవహించిన వ్యక్తి వారిని కాలుతో తన్ని భక్తుల సమస్యను విని పూలను భక్తులకు ఇచ్చి ఆశీర్వదిస్తాడు. కాలుతో తన్నిన తరువాత వారి కష్టాలు సంతానం లేని వారికి సంతానం, ఉద్యోగం రాని వారికి ఉద్యోగం, ఇలా అన్ని సమస్యలు పరిష్కరం అవ్వుతాయని భక్తుల నమ్మకం. ఈ వింత ఆచారం చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తారు. ఈ అధునాతన యుగంలో కూడా ఇలాంటి మూఢ నమ్మకాలు జరుగుతుండటం విశేషం. అయితే, ఇక్కడ కేవలం నిరక్షరాస్యత లేని వాళ్లు మాత్రమే ఈ బోర్ల పండుకుని తన్నించుకుంటున్నారు అని అనుకుంటే పొరపాటే.. చదువుకున్న వారు కూడా ఉద్యోగం కోసం ఇలా కాలుతో తన్నించుకుంటున్నారు

# కొండెక్కిన టమాటా ధర

తిరుపతి, నవంబర్ 8, (న్యూస్ పల్స్)టమాటో ధర కొండెక్కింది. రికార్డ్ స్థాయిలో ఏకంగా 74 రూపాయలు పలుకుతోంది. ఈ ఏడాది ఇదే హయ్యెస్ట్ ప్రైస్ అంటున్నారు వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు. దిగుబడి తగ్గడం.. ఇతర రాష్ట్రాల్లో టామాటో పంట లేకపోవడంతో అత్యధిక ధర పలుకుతోంది. మదనపల్లి మార్కెట్‌కు ప్రస్తుతం 150 మెట్రిక్ టన్నుల టమాటో దిగుమతి అవుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు తగ్గడం, భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడం కారణంగా టమాటా ధరలు భారీగా పెరిగాయి.



కొత్త పంట చేతికొచ్చే వరకు పరిస్థితి ఇలానే ఉండేలా కన్పిస్తోంది. అంటే నవంబర్ నెలాఖరు వరకు వంటింట్లో టమాటా కన్పించక పోవచ్చు. చిత్తూరు జిల్లా మదనపల్లి మార్కెట్‌లో కిలో టమాటా 74 రూపాయల వరకు పలుకుతోంది. అన్‌సీజన్‌లో అత్యధిక ధర నమోదైంది. గత నాలుగేళ్లుగా అన్‌సీజన్‌లో ఇదే అత్యధిక ధరని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పెద్దగా టమాటా దిగుబడులు లేకపోవడంతో ధరలకు రెక్కలొచ్చాయి. బయట మార్కెట్లలో పెద్దగా టమాటా కన్పించకపోవడంతో అంతా మదనపల్లి మార్కెట్‌కే వస్తున్నారు. చుట్టుపక్కల జిల్లాల నుంచి టమాటా మదనపల్లి మార్కెట్‌కు వస్తోంది. అన్‌సీజన్‌లోనూ టమాటాకు మంచి ధర పలకడంతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అటు రైతులు మాత్రం ఎప్పటిలానే దళారుల చేతుల్లో మోసపోతున్నారు. ఇటు కరోనా దెబ్బకు ఆర్థికంగా చితికిపోయిన సామాన్యులకు ఈ ధరలు మరింత షాకిచ్చాయి. అయితే సామాన్య ప్రజలు కూడా టమాటా అంటేనే వణికిపోతున్నారు.c

# కేసరపల్లి జాతీయ రహదారిపై బైక్ ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గన్నవరంనవంబర్ 8, (న్యూస్ పల్స్) గన్నవరం మండలం కేసరపల్లి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం. సావర గూడెం జంక్షన్ వద్ద ముగ్గురు వ్యక్తులతో వెళ్తున్న బైక్ ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమించింది. దీంతో స్థానికులు క్షతగాత్రులను వెంటనే విజయవాడ ఆస్పత్రికి తరలించారు. ఏలూరు నుండి విజయవాడ వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

# నాగమల్లి చెట్టు దగ్గర పూజలు

నూజివీడు నవంబర్ 8, (న్యూస్ పల్స్)నాగుల చవితి సందర్భంగా పుట్టల వద్ద,నాగేంద్ర స్వామి ఆలయాల వద్ద భక్తులు పోటెత్తారు. నూజివీడు పట్టణంలోని గాంధీనగర్ లోని నాగమల్లి చెట్టు వద్ద పుట్టలో పాలు పోసారు. నాటి జమీందారుల కాలం నుండి నాగుల చవితి రోజున పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఏదైనా కోరిక కోరితే తప్పక తీరుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. కొన్ని వందల సంవత్సరాల చరిత్ర కలిగిన నాగమల్లి చెట్టు వద్ద నాగ మల్లె పూలు వాసన వంద మీటర్ల మేర సువాసనలు ఘుమాళిస్తూ ఉంటాయి.

# యాగంటిలో కార్తీక శోభ

కర్నూలు నవంబర్ 8, (న్యూస్ పల్స్)కార్తీక మాసం సందర్భంగా కర్నూలు జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలోనిబ్ యాగంటి ఉమామహేశ్వర శైవ క్షేత్రం లో కార్తీక శోభ సంతరించుకుంది. ఈనెల 5వ తేదీ నుండి కార్తీక మాసం ప్రారంభం కావడంతో ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మారుమోగుతోంది. సోమవారం ఉదయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కుంకుమార్చన సహస్ర నామావళి మధ్యాహ్నం మహానివేదన జరిగింది. రాత్రి స్వామివార్ల పల్లకి సేవ ఉత్సవం నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమంలో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి ప్రసాద్ యాగంటి ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి కార్తీక మాసం సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో ఉమామహేశ్వరుని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

# భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

### వాహనాలు,మొబైల్ ఫోన్ సీజ్
### నలుగురు నిందితులు అరెస్ట్

తుగ్గలి నవంబర్ 8( విభారె) తుగ్గలి మండల పరిధిలోని గల మారెళ్ళ గ్రామ సమీపంలో భారీగా కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణా రెడ్డి,తుగ్గలి ఎస్సై షామీర్ బాషా తెలియజేశారు.ఆదివారం రోజున అందిన సమాచారం మేరకు ఉదయం 10 గంటల సమయంలో మారెళ్ళ సర్కిల్ పరిధిలో మద్యంపై ప్రత్యేక దాడులు నిర్వహించగా కర్ణాటక కు చెందిన సుమో కేఏ 34 ఏ 7743 వాహనంలో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.దాడులలో పట్టుబడిన నిందితులను అదుపులోకి తీసుకొని వారి వాహనంలో ఉన్న 90 ఎమ్మెల్ 25 బాక్సులు,180 ఎమ్మెల్ 25 బాక్సులను స్వాధీనం చేసుకున్నారు.మొత్తంగా వారి వద్ద నుండి 50 బాక్సులు మరియు 3600 టెట్రా ప్యాకెట్లు ఒరిజినల్ చాయిస్ విస్కీని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలియజేశారు.అదేవిధంగా వీరి వద్దనుండి టాటా సుమో,కేఏ 34 ఈహెచ్ 5873,నాలుగు సెల్ఫోన్ల ను స్వాధీనం చేసుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తుల పై మరియు కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలియజేశారు.చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న తుగ్గలి ఎస్ఐ షామీర్ భాషను మరియు తుగ్గలి పోలీస్ సిబ్బందిని పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణ రెడ్డి అభినందించారు.అక్రమ మద్యం తరలించే ఎటువంటి వారినైనా ఉపేక్షించేది లేదని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మండల వ్యాప్తంగా ఎక్కడైనా అక్రమ రవాణా జరుగుతుంటే పోలీసువారికి సమాచారం అందించాలని సిఐ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి ఎస్సై షామీర్ భాష,తుగ్గలి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ లెవల్లో వాస్తవ పరిస్థితులను తెలుసుకోండి

### వత్తిడి వద్దు సచివాలయ ఉద్యోగులు

నంద్యాల నవంబర్ 8( విభారె)పని వత్తిడి తో సచివాలయ ఉద్యోగుల పరిస్థితి చాలా దారుణంగా ఉందని మమ్ములను ముఖ్యమంత్రి ఆదుకోవాలని కోరుతూన్నారు .సచివాలయంలో సిబ్బందికి ఇబ్బందులు లేకుండా వెంటనే ప్రభుత్వం స్పందించాలని వారు కోరుతున్నారు. అధికారికంగా క్యాలెండర్ ప్రకారం ఈచిక సెలవులు మంజూరు చేయాలని కోరుతున్నారు. పండుగ రోజులు రెండవ శని వారం, అది వారంలు సెలవులు ఉన్న కూడా మాతో పని చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . లేబర్ చట్టాల ప్రకారం రోజుకు కి 8 గంటలు మాత్రమే పని చేయాలని ఉన్నా సచివాలయ ఉద్యోగుల కు అలా జరగడం లేదన్నారు. ప్రస్తుతం రోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 వరకు కూడా పనులు చేయాల్సి వస్తోందని అంటున్నారు. లేకపోతే మెమోలు, ఇస్తున్నారన్నారు . సచివాలయ సిబ్బంది రూల్స్ మాట్లాడితే సస్పెన్షన్లు చేస్తామని హెచ్చరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగుల కంటే రోజు కూలీ చేసుకొనే వారు ప్రశాంతంగా జీవిస్తున్నారని రోజు టార్గెట్లతో , పై అధికారుల నుండి త్రీవ స్థాయి ఒత్తిడిలు తో, పని త్రీవతతో బీపి సుగర్ , అల్సర్, మెంటల్, హార్ట్ ఎటాక్ లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు . ఫీల్డ్ లెవెల్లో వాస్తవ పరిస్థితి లు, సమస్యల గురించి తెలుసుకోకుండా ఉన్నతాధికారులు వారు చెప్పే పనులే చేయాలని వత్తిడి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు . సాంకేతిక సమస్యలు, ఉద్యోగుల కొరత వంటి సమస్యలు తీర్చ కుండా, కేవలం పనులు, పలితాలు మాత్రమే కావాలని అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు . మా సమస్యల గురించి ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి మాకు సరైన న్యాయం చేయాలని సచివాలయు సిబ్బంది కోరుతున్నారు.

## వైయస్ ఆర్ నగర్ లో దేవాలయాలకు భూమిపూజ నిర్వహించిన యమ్ యల్ఏ శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

నంద్యాల నవంబర్ 8( విభారె)నంద్యాల పట్టణంలో38 వ వార్డు వైయస్సార్ నగర్ లో లో గతంలో మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి వైయస్సార్ నగర్ ప్రజల కోసం 56 సెంట్ల స్థలాన్ని అయ్యప్ప స్వామి దేవాలయంకు మరియు రామాలయం నిర్మించడం కోసం స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. అస్తలం లో నేడు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి దేవాలయాలకు భూమిపూజ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూఈరోజు దేవాలయాల నిర్మించడం కోసం వైయస్సార్ నగర్ ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూమి పూజ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే దేవాలయ పనులన్నీ త్వరగా పూర్తి కావాలని అలాగే అక్కడ డెవలప్మెంట్ చేయడానికి మా వంతు కృషి చేస్తామని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాభున్నిసా,మున్సిపల్ వైస్ చైర్మన్ గంగి శెట్టి శ్రీధర్,38 వార్డు కౌన్సిలర్ సావిత్రిమ్మ,బెస్త డైరెక్టర్ చంద్ర శేఖర్,కౌన్సిలర్ చంద్ర శేఖర్,వైసీపీ నాయకులు టివి రమణ,సాయిరాం రెడ్డి, పద్మశ్రీ సుబ్బరాయుడు, మరియు . నాయకులు వైయస్ ఆర్ నగర్ ప్రజలు పాల్గొన్నారు.

# ఆందోళన మంచిదే!

నొప్పిని ఎవరూ కోరుకోరు. కాస్తంత నొప్పిగా అనిపించినా విలవిల్లాడిపోతాం. ఆత్మీయులు నొప్పితో బాధపడుతున్నా తల్లడిల్లుతాం. ఇదంతా చూడలేక, ఏ శాస్త్రవేత్తో అసలు నొప్పే కలగని మందును కనిపెట్టాడే అనుకోండి. అంతకంటే దురదృష్టం ఉండదు. ఎందుకంటే నొప్పి? ఓ బాధ మాత్రమే కాదు. అది ఒక సూచన, హెచ్చరిక. నొప్పి లేకపోతే శరీరంలో ఏం జరుగుతోందో తెలిసే అవకాశమే ఉండదు.చీకటిలో మిగిలిపోవాలని ఎవరికీ ఉండదు. అంధకారంలో అరక్షణం కూడా ఉండలేరు. గాఢనిద్రలో తప్ప నిశీధిని భరించలేరు. అలాగని ఎవరైనా చీకటిని తరిమికొడితే! శాశ్వతమైన వెలుగును తట్టుకోలేం. ఎందుకంటే చీకటి విశ్రాంతికి ఆలవాలం. ఎన్నో జీవజాతులకు చీకటే ఆలంబన.నొప్పి లేని శరీరం, చీకటి లేని లోకంలాగే? ఆందోళన (జీనిలీతివబిఎ) లేని మనసు కూడా ఊహించడానికి మాత్రమే బాగుంటుంది. అదే లేకపోతే బతుకు స్తబ్ధుగా మారిపోతుంది. ఎందుకంటే ఒత్తిడి ఓ ప్రేరకం. హద్దులు దాటే ఒత్తిడితో జీవితం గాడి తప్పుతుంది. అపజయాల సంగతి అలా ఉంచితే, అనారోగ్యానికి దారి తీస్తుంది. అదే ఒత్తిడిని అదుపులో ఉంచుకోగలిగితే? వెన్నంటి నడిపించే గురువులా మనల్ని తీర్చిదిద్దుతుంది. అందుకే మనకు కావల్సింది, ఆ ఒత్తిడిని అదిమిపెట్టడం కాదు. దాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకోవడం. దాన్ని జీవన నైపుణ్యంగా మలుచుకోవడం!పది వేల సంవత్సరాల నాటి సంగతి. అడవే లోకంగా బతుకుతున్నాడు మనిషి. ఆకులూ, అలములే ఆహారం. చిన్నచిన్న జంతువులను వేటాడుతూ, క్రూరమృగాల నుంచి తప్పించుకుంటూ కాలం గడిపేస్తున్నాడు. గుహే అతడి స్వర్గసీమ. అలాంటి సమయంలో ఓ ఇద్దరు యువకులు వేటకు బయల్దేరారు. ఈదురుగాలి, సన్నగా వర్షం, ఉన్నట్టుండి ఉరుములు? ఎటు చూసినా వాతావరణం భయానకంగా కనిపిస్తోంది. ఇంతలో! ఎదురుగుండా ఓ విషనాగు. పడగ విప్పి బుసలుకొడుతున్నది. దాన్ని అలాగే వదిలేస్తే, గుహలోకి వచ్చేట్టుంది. చంపేద్దామంటే కాటేస్తుందేమో అన్న భయం. ధర్మసంకటమే! కానీ త్వరగా నిర్ణయం తీసుకోవాలి. ఆ నిర్ణయం కోసం శరీరంలోని అణువణువూ సన్నద్ధం అవుతోంది. పరిస్థితిని ఎదుర్కొనేందుకైనా, పారిపోయేందుకైనా కావల్సిన వాతావరణాన్ని కల్పించుకుంటోంది. ఒంట్లోని ప్రతి అణువూ ఇంతలా పనిచేయడంతో? ఒళ్లు వేడెక్కిపోయే ప్రమాదం ఉంది. అందుకే దాన్ని చల్లబరుస్తూ చెమటలు మొదలయ్యాయి. మనిషి ఆలోచన మారింది. బతుకు మారింది. అరచేతిలో వైకుంఠాన్ని చూపే సాంకేతికత అందుబాటులోకి వచ్చేసింది. కానీ, తనకు ఎదురయ్యే సవాళ్ల గురించి ఆందోళన చెందటం మాత్రం మానలేదు. నిర్ణయం తీసుకోవాల్సిన సందర్భంలో, సవాలును ఎదుర్కొనేటప్పుడు, సమస్య నుంచి తప్పించుకునేటప్పుడు, ఆత్మరక్షణలోకి జారినప్పుడు, అవమాన పడినప్పుడు? ఇలా ఎన్నో సందర్భాల్లో అతను ఆందోళన చెందుతూనే ఉన్నాడు. దాని ప్రభావం మనసు మీదా, శరీరం మీదా పడుతూనే ఉంది. బుసలు కొట్టే పామును చూసినప్పుడు కలిగిన స్పందనలు, తన పై ఆఫీసరు హఠాత్తుగా తనిఖీకి వచ్చినప్పుడు కలగవచ్చు. అంతేకాదు! మనం అభద్రతకు గురయ్యే ప్రతి సందర్భంలోనూ విపరీతంగా ఆందోళన చెందుతూనే ఉంటాం. కొందరికి పరీక్షలంటే కంగారు, కొంతమందికి ప్రయాణమంటే ఆందోళన, ఇంకొందరికి కొత్త పరిచయాలంటే వ్యాకులత. వెరసి యాంగ్జయిటీ అనే సమస్యను ఎదుర్కొంటున్నామని తెలిసినా, తెలియకపోయినా? దాని వల్ల మాత్రం ఇబ్బంది పడుతూనే ఉంటాం. ఆందోళనకూ, భయానికీ మధ్య ఓ చిన్నపాటి తేడా ఉంది. ప్రమాదంలో ఉన్నామని భావించినప్పుడు కలిగేది భయం. అది ప్రమాదమో కాదో తెలియకపోయినా? ఏం జరుగుతుందో అని ఊహించుకున్నప్పుడు కలిగే ఆరాటం? యాంగ్జయిటుర్తించడం ఎలా?మనసు ఆందోళన పడుతున్నప్పుడు మనకు ఇట్టే తెలిసిపోతుంది. కొన్ని శారీరక మార్పులు మనం ఒత్తిడిలో ఉన్న విషయాన్ని గుర్తుచేస్తాయి. కానీ ప్రతిసారీ ఒకే తరహా లక్షణాలు ఉంటాయనీ, మనం వాటిని స్పష్టంగా గుర్తించగలమనీ అనుకోవడానికి వీల్లేదు. అందుకే ఆందోళన వల్ల సంభవించే మరిన్ని పరిణామాలను గమనించే ప్రయత్నం చేయాలి. వాటిలో ముఖ్యమైనవి?

తప్పించుకునే ప్రయత్నం ? చేయాల్సిన పనిని, ఎదుర్కోవాల్సిన సవాలునూ తప్పించుకుని దూరంగా తిరుగుతాం. చాలా సందర్భాల్లో దానివల్ల ఉపయోగం ఉండదనీ? మరుసటి రోజు, ఆ సవాలు మరింత క్లిష్టతరం అవుతుందనీ తెలుస్తూనే ఉంటుంది. అయినా, తప్పించుకోవడానికి లేదా వాయిదా వేయడానికి కారణం.. యాంగ్జయిటీ!అతిగా ఆలోచించడం: ఆలోచన లేకుండా మంచి, చెడులను ఎంచుకోలేం. నిర్ణయం తీసుకోలేం. కొన్ని విషయాల్లో ఇంకాస్త జాగ్రత్తగా ఆలోచించాల్సిందే. కానీ ఒకే విషయంలో ఎడతెగని ఊగిసలాట ఉంటే? అది ఆందోళనకు సూచనగా భావించాలి.

జీర్ణ సమస్యలు: ఆకలి వేయకపోవడం, ఆహారం జీర్ణం కాకపోవడం లాంటి సమస్యలు కూడా చాలాసార్లు ఆందోళనను సూచిస్తాయి.సహనం కోల్పోవడం: కొంతమంది చిన్నపాటి ఆలస్యాన్ని కూడా ఓర్చుకోలేరు. క్యూలో నిలబడ్డం దగ్గర నుంచీ, బస్సు కోసం ఎదురుచూడ్డం వరకూ? తన చేతిలో లేని పరిస్థితుల్లో కూడా సహనాన్ని కోల్పోతుంటారు. ఆ అసహనం ఆందోళనకు ఒక సూచన.ఏకాగ్రత లేకపోవడం: నిర్ణయం తీసుకోవాలనుకుంటారు. కానీ ఆలోచనలన్నీ అస్తవ్యస్తంగా పరుగులు తీస్తుంటాయి. సమయానికి ఏదీ గుర్తుకురాదు. వివరాలు స్ఫురించవు. ఆ ఒత్తిడిలో మనం ఏం చేస్తున్నామో కూడా అర్థం కాని అయోమయం. ఏదో ఓ విషయానికి సంబంధించి వ్యాకులతతో ఉన్నామనడానికి సంకేతమిది...ఇవే కాదు. ఆందోళన శారీరక సమస్యలకూ కారణం అవుతుంది. ఉదాహరణకు చాలా సందర్భాల్లో నిద్రలేమి, మనసు పొరల్లోని ఆందోళనకు సూచన. యాంగ్జయిటీలో తలనొప్పి సహజమే. చాలామందిలో శ్వాసకు సంబంధించిన ఇబ్బంది తలెత్తుతుంది. గుండెపోటు వచ్చిందా? అన్నంత తీవ్రంగా ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతుంటారు.

# కార్తికేయ విలన్ రోల్స్ కూడా చేస్తుండాలి



దిల్ రాజు ఎంతోమంది దర్శకులను .. హీరోలను పరిచయం చేశారు. అలాగే ఆయా సినిమాల ప్రీ రిలీజ్ ఈవెంట్స్ కి వెళ్లి యంగ్ హీరోలకు కావలసిన సూచనలు చేస్తూ ప్రోత్సహిస్తూ ఉంటారు. నిన్న రాత్రి జరిగిన 'రాజా విక్రమార్క' ప్రీ రిలీజ్ ఈవెంట్ కి ఆయన హాజరయ్యారు. ఈ వేదికపై ఆయన మాట్లాడుతూ .. "ఇప్పుడు కొత్త హీరోలంతా కొత్తగా కొత్తగా ఆలోచిస్తూ వస్తున్నారు. కార్తికేయ .. కిరణ్ అబ్బవరం .. సుధాకర్ .. ఇలా చాలామంది వస్తున్నారు.నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో నాతో చాలామంది అనేవారు 'నీకు బ్యాక్ గ్రౌండ్ లేదుగదా ఎలా'? అని. సినిమా ఇండస్ట్రీలోకి వచ్చేవారికి బ్యాక్ గ్రౌండ్ ఉండవలసిన అవసరం లేదు .. టాలెంట్ ఉంటే ఆటోమేటిగ్గా సక్సెస్ అవుతారు. ఇప్పుడు ఈ హీరోలు కూడా అదే ప్రూవ్ చేస్తున్నారు. ఒక అపోహ ఉంది .. సినిమా ఇండస్ట్రీలోకి వచ్చిన కొంతమందే సక్సెస్ అవుతారని. ఇక్కడ అలాంటిదేం ఉండదు. కార్తికేయ ఫస్టు సినిమా ఆడకపోయినా .. సెకండ్ సినిమా 'ఆర్ ఎక్స్ 100' హిట్ అయింది.ఆ సినిమా టీజర్ ను వాళ్ల బాబాయి నాకు చూపించాడు. అప్పుడే చెప్పాను నేను .. చాలా ఇంట్రెస్టింగ్ గా ఉందని. 'ఆర్ ఎక్స్ 100' తో హిట్ కొట్టిన కార్తికేయ ఈ రోజున విలన్ రోల్స్ చేయడానికి కూడా రెడీగా ఉన్నాడు. కార్తికేయకు చెబుతున్నాను .. ఆయన కేవలం హీరోగా మాత్రమే చేయాలని ఫిక్స్ కావొద్దు. ఆయన ఒక్కో అవకాశాన్ని వాడుకుంటూ వెళ్లాలి .. అప్పుడే లాంగ్ రన్ ఉంటుంది. హీరోగా ఎప్పటివరకూ ఉండగలుతారనేది వాళ్లు ఎంచుకునే కంటెంట్ పై ఆధారపడి ఉంటుంది.ఎందుకంటే తెలుగు ఇండస్ట్రీలో ఎక్కువమంది హీరోలు ఉన్నారు. ఇండియాలోనే మరే ఇండస్ట్రీలో ఇంతమంది హీరోలు లేరు. ఒకందుకు ఇది గర్వంగా చెప్పుకోవలసిన విషయమే. యంగ్ జనరేషన్ అన్నిరకాల పాత్రలను చేయడానికి సిద్ధమై వెళ్లాలి. కిరణ్ అబ్బవరం హీరోగా అండర్ ప్రొడక్షన్లో నాలుగు సినిమాలు ఉన్నాయి. ఆయనకి కూడా నేను ఇదేమాట చెబుతున్నాను. కథలు సెలెక్ట్ చేసుకుని మిమ్మల్ని మీరు నిరూపించుకోవడానికి చేస్తున్న ఫైట్ డెఫినెట్ గా అభినందనీయం .. ఆల్ ది బెస్ట్. ఈ సినిమా ట్రైలర్ చూశాను .. చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంది.ట్రైలర్ చూడగానే కార్తికేయ కు కాల్ చేసి చెప్పాను. తను సీరియస్ పాత్రలే కాదు మంచి హ్యూమరస్ పాత్రలు కూడా చేయగలడని ఈ ట్రైలర్ ద్వారా అర్థమైంది. ట్రైలర్ మాదిరిగానే సినిమా ఉండాలని ఆశిస్తున్నాను. ఇండియా మొత్తం నిన్న 'సూర్యవంశీ' రిలీజ్ అయింది. అలాగే రజనీకాంత్ గారి సినిమా కూడా రిలీజ్ అయింది. అందరూ కూడా థియేటర్స్ కి వస్తుండటంతో సినిమాలు సక్సెస్ ఫుల్ గా రన్ అవుతున్నాయి. అలాగే నవంబర్ 12న విడుదలవుతున్న సినిమాలు కూడా సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను" అని చెప్పుకొచ్చారు.




# మను చరిత్ర నుంచి బ్యూటీఫుల్ మెలోడీ!




టాలీవుడ్ నిర్మాత రాజ్ కందుకూరి తనయుడు శివ కందుకూరి నటిస్తోన్న తాజా చిత్రం 'మను చరిత్ర'. ఇందులో మేఘా ఆకాష్- ప్రియ వడ్లమాని- శ్రీవాత్సవ హీరోయిన్లుగా నటిస్తున్నారు. భరత్ పెదగాని దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్ సమర్పణలో ప్రొద్దుటూర్ టాకీస్ పై నరాల శ్రీనివాసరెడ్డి నిర్మిస్తున్నారు. రాన్సన్ జోసెఫ్ కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. గోపీ సుందర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ? టీజర్ సినిమాపై ఆసక్తిని కలిగించాయి.అలాగే కాజల్ రిలీజ్ చేసిన 'ఎక్కడ ఉంటాదిరో ఆ పిల్ల' అనే పాట లిరికల్ వీడియోకి శ్రోతల నుంచి మంచి ఆదరణ లభించింది.క్లాస్ మాస్ తో పాటు అన్ని వర్గాలకు పాట రీచ్ అయింది. తాజాగా మరో లిరికల్ సాంగ్ ని రిలీజ్ చేసారు. "కనబడకనే తెగ తిరుగుతు నను వెతికిన తుంసే మేరా ప్యార్ హువా..పద పదమని నీవెనుకనే నను కదిపిన దిల్ సే మేరా ప్యార్ హువా" అంటూ సాగే మెలోడీ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. గోపీ సుందర్ మార్క్ మెలోడీగా కనెక్ట్ అవుతుంది. చక్కని ట్యూన్స్ ..సాహిత్యం కుదిరాయి. ఈ సినిమాతో ఎలాగైనా హిట్ కొట్టాలని శివ వెయిట్ చేస్తున్నాడు.'చూసి చూడంగానే' అనే సినిమాతో శివ హీరోగా పరిచయమయ్యాడు. ఆ సినిమా శివ అంచనాల్ని అందుకోలేకపోయింది. గమనం అనే మరో సినిమాలో నటిస్తున్నాడు. ఇది తెలుగు..తమిళ్ కన్నడలో తెరకెక్కుతోంది.ఇందులో నిత్యామీనన్..శ్రియ..ప్రియాంక జవాల్కర్ నటిస్తున్నారు. కంటెట్ బేస్డ్ చిత్రమిది. శివ రోలా ఎలా ఉంటుందన్ని తెలియాలి. అయితే సోలో హీరోగా నటిస్తోన్న 'మను చరిత్ర'పైనే శివ ఎక్కువగా ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

# 'ఆఖరి మ్యాచ్‌లో కోహ్లి... రోహిత్ శర్మకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పజెప్పాలి'




టీ20 వరల్డ్‌కప్ గెలిచి ఘనంగా కెప్టెన్సీకి వీడ్కోలు పలకాలన్న టీమిండియా సారథి విరాట్ కోహ్లిని దురదృష్టం వెక్కిరించింది. అఫ్గనిస్తాన్‌పై న్యూజిలాండ్ విజయం సాధించడంతో టీమిండియా సెమీస్ ఆశలు గల్లంతైన నేపథ్యంలో రిక్తహస్తాలతోనే వెనుదిరగాల్సిన పరిస్థితి. టోర్నీ ఆరంభంలో చేసిన భారత జట్టు చేసిన తప్పిదాల కారణంగా ఈవిధంగా భారీ మూల్యమే చెల్లించాల్సి వచ్చింది. నాకౌట్ దశలోనే వెనుదిరగాల్సి వచ్చింది. ఈ క్రమంలో నవంబరు 8న టీమిండియా.. పసికూన నమీబియాతో నామమాత్రపు మ్యాచ్ ఆడనుంది.కాగా, టీ20 వరల్డ్‌కప్-2021 ముగియగానే టీ20 సారథ్య బాధ్యతల నుంచి తప్పుకొంటానని కోహ్లి ప్రకటించిన నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈవెంట్ చివరి మ్యాచ్‌లో వైస్ కెప్టెన్ రోహిత్ శర్మకు పగ్గాలు అప్పజెప్పాలని సూచించాడు. టీమిండియా- నమీబియా మ్యాచ్ నేపథ్యంలో మంజ్రేకర్ మాట్లాడుతూ.. "టీ20 క్రికెట్‌లో భారత్‌కు మెరుగైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్న కోహ్లి గనుక సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టాలని భావిస్తే.. ఫైనల్ మ్యాచ్‌లోనే తనంతట తానుగా రోహిత్ శర్మకు సారథ్య బాధ్యతలు అప్పగించాలి.అలా అయితే తనను విశ్రాంతి పేరిట పక్కకు పెట్టరు. కెప్టెన్‌గా తను ముందుకు సాగుతాడు" అని చెప్పుకొచ్చాడు. ఈ మేరకు డఫా న్యూస్‌తో తన సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా ముచ్చటించాడు. కాగా టీ20 తదుపరి కెప్టెన్‌గా హిట్‌మాన్ నియామకం లాంఛనమే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా.. వయసు రీత్యా 34 ఏళ్ల రోహిత్ కంటే కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ వంటి యువ ఆటగాళ్లకు అవకాశం ఇస్తే బాగుంటుందని కొంత మంది మాజీలు అంటున్నారు.ఈ నేపథ్యంలో మంజ్రేకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇక 2017లో టీమిండియా టీ20 కెప్టెన్‌గా తొలి మ్యాచ్ ఆడిన కోహ్లి.. ఇప్పటి వరకు 49 మ్యాచ్‌లకు సారథ్యం వహించాడు. అందులో 29 మ్యాచ్‌ల(గెలుపు శాతం 63.82)లో విజయాలు అందించాడు.

## 24 ఏళ్ల తర్వాత పాకిస్తాన్‌లో పర్యటించనున్న ఆస్ట్రేలియా..

24 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా జట్టు తొలి సారిగా పాకిస్తాన్‌లో పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా మూడు టెస్టులు, మూడు వన్డేలు, ఒక టీ20 మ్యాచ్‌ను పాకిస్తాన్‌తో ఆడనుంది. ఆసీస్ పర్యటనకు సంబంధించిన వివరాలను పాకిస్తాన్ క్రికెట్ బోర్డు సోమవారం (నవంబర్ 8) వెల్లడించింది. ఈ సిరీస్ కరాచీలో జరగబోయే మొదటి టెస్ట్‌తో ప్రారంభమవుతుంది. రెండో టెస్ట్ రావల్పిండిలో, మూడో టెస్ట్‌తో పాటు మూడు వన్డేలు, ఆస్ట్రేలియా చివరిసారిగా 1998లో పాకిస్తాన్‌లో పర్యటించింది. ఆ తర్వాత వివిధ కారణాల వల్ల అనేక సార్లు పాక్ పర్యటను ఆస్ట్రేలియా రద్దు చేసుకుంది. 2002 పాకిస్తాన్‌లో పర్యటించాల్సిన ఆస్ట్రేలియా.. కరాచీలో ఆత్మాహుతి బాంబు దాడితో ఆ పర్యటను రద్దు చేసుకుంది. అదే విధంగా 2008లో పర్యటించాల్సిన ఆస్ట్రేలియా.. పాకిస్తాన్‌లో సాధారణ ఎన్నికలకు ముందు జరిగిన హింసాత్మకమైన ఘటనల నేపథ్యంలో పర్యటను మరోసారి రద్దు చేసుకుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190